# చైతన్యం

రు. 20/-

సంకల్ప బలం

జూన్ 2021




సామాజిక విలువల మాసపత్రిక

# కా.రా. మాస్టారు

## (శ్రీ కాళీపట్నం రామారావు 1924-2021)




ఎస్ కె బి ఆర్ కాలేజీకి వన్నె తెచ్చి,
విద్యార్థులందరి జీవితాలకు బంగారు బాట
వేసిన శ్రీ నిష్ఠల రామదాసు గారి ఆత్మకు
శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ -
ఎస్ కె బి ఆర్ కాలేజీ శిష్య బృందం




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

జూన్ 2021

సంపుటి -10 సంచిక - 9



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| హితోక్తులు | 6 |
| చేపా .. చేపా | 7 |
| క్షాంతువు బీజము | 9 |
| వేదులాన్వయు పలుకు | 12 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 13 |
| సప్త మోక్ష నగరాలు | 16 |
| 116 కందాల్లో సుందరకాండ | 20 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 23 |
| ప్రేమంటే ఇంతే | 27 |
| జలియన్ వాలా బాగ్ | 33 |
| అమృతం కన్నా అమ్మపాలు మిన్న | 35 |
| నవవిధ భక్తులు | 36 |
| మా ఊరి నందుల కథ | 37 |
| శ్రీ వచన భూషణం | 38 |
| క్రాస్ వర్డ్ పజిల్ కథా కమామీషు | 41 |
| అసలు కవిత్వానికి ఆనవాలు | 45 |
| క్షణ భంగురం | 48 |
| మతి | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

కరోనా నిబంధనలు ఎవరికీ?

మన దేశంలో ఒక పక్క కరోనాతో బాధ పడి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు తిండికి కూడా నోచుకోక రోడ్డున పడ్డారు, పడుతున్నారు. మరి కొన్ని కుటుంబాలలో కుటుంబ సభ్యులను కోల్పోయి మానసిక బాధకు లోనై జీవచ్ఛవంలా బతుకుతున్నారు. ఇంకా కొందరు కోవిడ్ వచ్చి తేరుకుని శారీరక శక్తి నశించి బలవంతంగా కాలాన్ని వెళ్లదీసే వారు కూడా ఉన్నారు.

ఇంకా దురదృష్ట మేమంటే 'వైద్యో నారాయణో హరిః' అంటూ తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కరోనా రోగులను కాపాడడంలో 624 మంది (ఈ రోజుకి )తమ ప్రాణాలనే పణంగా పెట్టారు. ఇలా బలైనవారి-లో ఫ్రంట్ లైన్ వర్కర్స్ గా నర్సులు, పోలీసులు, మున్సిపాలిటీ వర్కర్స్ ఇలా చాలా మంది ఉన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో దేశం ఆర్థికంగానే కాక ఎన్నో రకాలుగా నష్టపోతోంది. ప్రజలు కూడా బాధతో అయోమయంలో ఉన్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. అమెరికా నుండే కాక పలు దేశాలు మన దేశానికి వేక్సిన్ , వెంటిలేటర్లు తో సహా పలు రకాలుగా సహాయం అందిస్తున్నాయి. మన దేశంలో కూడా కొందరు డబ్బున్న వారు పేదవారికి రక రకాలుగా సహాయం అందిస్తున్నారు. అలాగే సేవా సంస్థలు ఎన్నో రకాలుగా వారి సహాయాన్ని అందిస్తున్నారు. హోమియో, ఆయుర్వేదం వంటి మందులు కూడా ప్రజలకు ఉపయోగపడుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎవరికీ చేతనైన రీతిలో వారు సహాయాన్ని అందిస్తున్నారు.

అయితే ఇంకా మన ప్రభుత్వ పరిపాలనలో అసమానతలు చోటుచేసుకున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల, రాజకీయ పరిపాలకుల జీతాలు పెంచుకోవడంలో గానీ, వారి సౌకర్యాల విషయంలో గాని కరోనా నిబంధనలు వారికి పాటించవు, ఎంతో కష్టపడి పని చేసే వారికి మాత్రమే కరోనా కష్టాలు చెబుతుంది ప్రభుత్వం అనేది కూడా ప్రభుత్వం ఆలోచించ వలసిన అవసరం ఉంది అని కొందరు ప్రజలు వాపోతున్నారు.

ఇదే అమెరికాలో అయితే అందరికీ సమానంగా ఎప్పుడూ ఏదీ ఊరికే ఇవ్వని ప్రభుత్వం కూడా కరోనా కష్ట కాలంలో అందరికీ అకౌంట్లో జమ చేసింది. ఎక్కడ ఎవరికి ఎంత అవసరమో, ఎక్కడ విదేశీయుల నుండి వీసాలకు, చదువులకు ఫీజులు తీసుకోవాలో ముక్కుపిండి వసూలు చేస్తుంది. అలాగే రీసెర్చ్ చేసి ఏదైనా కని పెట్టిన వారికి మిలియన్ డాలర్ల డబ్బు ఇచ్చినా అక్కడ ఎవ్వరు సొంతానికి వాడుకోకుండా, మరలా ఇంకా ఏదైనా రీసెర్చ్ కి ఉపయోగ పడుతుంది అని ఆ డబ్బును డొనేట్ చేస్తారు. అలాగే 'లా' స్ట్రిక్టుగా పాటి-స్తారు. అక్కడ పెద్ద, చిన్న, దేశం విదేశం , డబ్బు,పేదరికం తేడాలు లేవు. మన దేశంలో ఇటువంటివి అన్నీ ఎందుకు పాటించ లేక పోతున్నాము?

ఇంత కరోనా కష్ట సమయంలో కూడా ఓ పక్క ప్రాణాలు కోల్పోతున్నా ఇంకా ఆసుపత్రుల దగ్గరనుండీ మందులు, ఆసుపత్రులు అలా అన్ని చోట్లా డబ్బే పరమావధిగా ఎందుకు మోసాలు చేసి ప్రజల నుండి పీడించి మరీ డబ్బు వసూలు చేస్తున్నారు? మరో పక్క ప్రకృతి సహజంగా వచ్చే మార్పులతో వర్షా కాలం మొదలై , కరోనా థర్డ్ వేవ్ గురించి హెచ్చరికలు వస్తుంటే, ఇప్పటికైనా మనలో మార్పు రావలసిన అవసరం లేదా? విదేశాలు మనకి ఏమిచ్చాయని చేతులు చాచే కన్నా మనకి ఉన్న వాటితో మనం తెలివిగా ఎంత-వరకు మనం కాపాడుకోగలుగుతున్నాం అనే విషయాన్ని మాత్రమే గ్రహించి, పాటించవలసిన అవసరం లేదా?

ఇకనైనా మనం మారదాం. ఇప్పటికే ప్రకృతిని పాడు చేసుకున్నాము . ఇప్పుడైనా మన ఆరోగ్యం, మన జీవనం ప్రకృతి మీద ఆధారపడి మాత్రమే ఉందన్న విషయాన్ని గుర్తుపెట్టుకుని ముఖ్యంగా వ్యవసాయాన్ని, చెట్లను, నీటిని కాపాడుకుంటూ మనం జీవనం సాగిద్దాము.

అమెరికా, లండన్ వంటి కొన్ని దేశాలు మన దేశ పౌరులకు రాక పోకలు నిషేధించింది ప్రస్తుతం. అలాగే మన దేశీయులు అమెరికాలో కొందరు చాలా కాలం నుండి వీసా ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్ కార్డు, సిటిజన్ షిప్ వగైరా వాటి కోసం చాలా టెన్షన్ పడుతున్నారు. అటువంటి వారికందరికి బైడెన్, కమలా హారిస్ ప్రభుత్వం వచ్చాక ఎంప్లాయిమెంట్ బేస్డ్ వీసాల బ్యాక్ లాగ్ క్లియర్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఇబ్బందులు పడిన భారతీయులంతా, బైడెన్ పాలనలో ఆనందంగా ఉన్నారనడంలో సందేహం లేదు.

*********

దేశాన్ని ఉక్కిరి బిక్కిరి చేసిన కరోనా వైరస్ సెకండ్ వేవ్ ఉధృతి తగ్గు ముఖం పడుతోంది. ఈ మహమ్మారికి కళ్లెం వేయడమే లక్ష్యంగా దేశమంతా కొనసాగుతున్న వ్యాక్సినేషన్ కు తోడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న పలు చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

ప్రధాని మోదీ హఠాత్తుగా ఓ ఆన్ లైన్ సమావేశంలో ప్రత్యక్షమై కొంతమంది సీబీఎస్ఈ విద్యార్థులను ప్రధాని మోదీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. సీబీఎస్ఈ పరీక్షలు రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ అక్ష్వార్యంలో విద్యార్థులు , వారి తల్లితండ్రులతో ఆన్ లైన్ లో ఓ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపై అధికారులు వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఈ లోగా అనుకోకుండా ప్రధాని మోడీ ఆ సమావేశానికి హాజరై అందర్నీ ఆశ్చర్య పరిచారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా కొద్దీ సేపు మాట్లాడారు. ప్రస్తుత విపత్కర పరిస్థితులలో పరీక్షలను రద్దు చేసినందుకు ప్రధానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

***********

చైనా సముద్రంలో చైనా అరాచకాలు మలేషియా దాకా వ్యాపించాయి. ఇప్పటి వరకు ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటి ప్రాంతాలకే పరిమితమైంది. చైనా యుద్ధ విమానాలు ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తుండడంతో మలేషియా కూడా ఫైటర్ జట్ విమానాలను రంగంలోకి దింపి వాటిని తరమాల్సి వచ్చింది. ఈ ఘటనతో ఒక్కసారి దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్, వియత్నాం, తైవాన్, బ్రునై, మలేషియా వంటి దేశాలున్నాయి అంతర్జాతీయ సముద్రజలాల చట్టం ప్రకారం తీరం నుంచి 12 నాటికల్ మైళ్ళ వరకు మాత్రమే ఆయా దేశాల తీర ప్రాంతాల కిందకి వస్తాయి. చైనాకు తనది అని చెప్పుకునే సముద్రంలో అతి తక్కువ భాగమే దక్కుతుంది. కానీ డ్రాగన్ దక్షిణ చైనా సముద్రాన్నే మింగేయాలనుకుంటోంది. ఇక్కడ భారీగా చమురు నిక్షేపాలున్నట్లు తేలింది . దీంతో వీటిని సొంతం చేసుకోవడం కోసం ఇక్కడి చాలా దీవులు తనవే అని చెబుతోంది. వీటిలో స్టార్ దీవులు కీలక మైనవి. వీటిని దక్కించుకోవడానికి ఒక దీవిని కృత్రిమంగా తయారుచేసి, అక్కడ తన యుద్ధ విమానాలను మోహరించింది.

*******

ప్రజలంతా ఇంటి పట్టునే ఉండి, ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలు పాటిస్తూ అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటూ...



మీ ఎడిటర్,

తీగవరపు శాంతి

# హితోక్తులు

**యోగరతోవా భోగరతోవా - సంగరతోవా సంగ విహీనః యస్య బ్రహ్మణి రమతేచిత్తం -నందతి నందతి నందత్యేవ. --**

భజగోవిందం లో శంకరులవారిశిష్యులు నిత్యా నందుడు చెప్పిన శ్లోకం ఇది. బంధ సహితు డైన వాడు యోగికానేరడు.చిత్తంలో భగవంతుని తలంచు కుంటూ కర్తవ్య కర్మలను నిర్వహించాలి.

పరమాత్మ అనే పురుషునికి ప్రవృత్తి, నివృత్తి అనే ఇరువురు భార్యలు.ప్రవృత్తి నైజం త్యాగం, నివృత్తి లోక కళ్యాణంకోసం కర్తవ్య కర్మలను నిర్వర్తిస్తూ ఉంటుంది. సంఘంలో ఉండి కూడా త్యాగరాజు,-జయదేవుడు, పోతన, వేమన,రామకృష్ణ పరమహంస, కబీరు, రామదాసు,మున్నగు వారు నామ స్మరణతో ఆత్మ తత్వం లో లీనమై ఉండేవారు. సంఘమునకు దూరంగా ఏహిమాల యా ల్లోనో ,అడవుల్లో నో ఉంటూ తపస్సు చేసుకునే వారి వల్ల సంఘానికి ఏమీ ప్రయోజనం లేదు.మరి కొందరు భక్తుల వలె నటిస్తూ తమనే కాక సమాజంలోని వారినీ మోసం చేస్తుంటా రు. జప ధ్యానాలు రత్నసమానాలు. వాటిని కొనగల వారికే అమ్మే వారు చూపుతా రు. స్థిర చిత్తులగుటకు మూడు సాధనలు ఉన్నాయి.

మొదటిది – మీనసాధన - మీనము అనగా చేప ,తాను నీటిలోమాత్రమే జీవించ గలదు.నేలపై బ్రతకలేదు. అలాగే ఏకాంతంలో మాత్రమే కొందరు సాధన చేయ గలరు.దీన్నే మీన సాధన అంటారు.

ఇహ రెండవది మృగ సాధన - మృగము అనగా పశువు, కేవలము భూమిపైన మాత్రమే జీవించ గలదు .నీటిలో జీవించ లేదు. కొందరు అలాగే పదిమందిలో సాధన చేయగలరు, ఏకాంతంలో సంసార బాధ్యతలు సాధన చేయనివ్వవు.

ఇహ మూడవది కూర్మ సాధన - కూర్మము అంటే తాబేలు నీటిలోనూ బయట కూడా జీవించగలరు. దానివలె కొందరు ఏకాంతం లో నూ పదిమంది మధ్య గుంపులోనూ సాధన చేయగల ఏకాగ్రత కలిగి ఉంటారు. సమచిత్తం పవిత్రమైన ఏకాగ్రతకు దారితీస్తుంది. అలాంటి ఏకాగ్ర చిత్తంతో పవిత్ర విశ్వాసంతో సాధన చేద్దాం. మనం సంఘంలో జీవిస్తున్నా దైవ విశ్వాసాన్ని వదలరాదు.

ఇంద్రియ నిగ్రహంతో సత్సంగంలో ఏకాగ్రతతో విన్న విషయాలను హృదయంలో భద్రపరచుకుని , వాటిని మననం చేసుకుంటూ చలించని చిత్తంతో భగవదను గ్రహానికి పాత్రులమయ్యేలా ప్రవర్తించాలి.విన్నవాటిని ఆచరించి నపుడే సార్ధకత. మన బుఱ్ఱ రజకుని గృహం వంటిది .పూర్వకాలం రజకులు ఊరి వారందరి బట్టలనూ తెచ్చి, నది లేక చెఱువు వద్ద ఉతికి ఆరేసి మూటకట్టి తెచ్చి ఉంచి, జాగ్రత్తగా ఎవరివి వారికి గుర్తుంచుకుని అప్పగిస్తాడు. చివరకు మూటకట్టిన గుడ్డ ఒక్కటే తనది మిగులుతుంది. వంట చేసేప్పుడు పప్పు, కూర, చారు,పాయసం లోనూ గరిటె పెట్టి త్రిప్పుతుంటాం ,కానీ ఆ గరిటెకు రుచి ఏమాత్రం తెలియదు.

**ఎడ్డెమనుష్యు డేమేరుగు ఎన్ని
దినంబులు కూడి యుండినన్
దొడ్డ గుణాఢ్యునందుగల
తోరపు వర్తన లెల్ల ప్రజ్ఞ బే
ర్పడ్డ వివేకి రీతి .రుచిపాక-
ము నాలుక గాకెఱుంగునే ?
తెడ్డది కూరలో గలయ ద్రిమ్మరు
చుండిన నైన భాస్కరా! -**

అన్నాడు భాస్కరశతక కారుడు . మనం అలాకాకూడదు. సత్సంగములో విన్న విషయాలను స్మరిస్తూ సాధనలో ఉంచాలి. కాలమునూ, జీవితమునూ పవిత్రం చేసుకోవాలి. ..

**** ఆదూరి.హైమావతి

# చేపా ... చేపా



భువనచంద్ర

ఏడుగురు పేషేంట్లు హాస్పిటల్ కి వెళ్లారు. ఒకడు డిస్చార్జ్ అయ్యాడు. మిగతా ఆరుగురూ డిశ్చార్జ్ కాలేదు. వాళ్ళు డాక్టర్ ని అడిగారు.

"డాక్టర్ డాక్టర్ మేమెందుకు డిస్చార్జ్ కాలేదు?" అని.

"మీకు జబ్బు తగ్గలేదు గనక" నవ్వాడు డాక్టర్.

"ఎందుకు తగ్గలేదు?"

"హాస్పటల్లో మంచాలు లేవు గనక"

"మంచాలకీ జబ్బుకీ సంబంధం ఏముందీ?"

"మంచం ఉన్నోడికే ఆక్సిజన్ ఇస్తాం గనక"

:పోనీ మంచాలు మేమే తెచ్చుకుంటాం. అప్పుడూ?"

"మంచాలు తెచ్చుకున్నా ఆక్సిజన్ లేదు గనక"

"ఆక్సిజన్ ఎందుకు లేదూ?"

"కోట్లాది చెట్లు కొట్టేశారు గనకా .. తగినన్ని ప్లాంట్లు లేవు గనకా .. వున్నవి తగినంత ఆక్సిజన్ సరఫరా చెయ్యట్లేదు గనకా "

"ఆక్సిజన్ తెప్పించవచ్చుగా. ఎందుకు తెప్పించలేదూ? గుండు సూదులనుంచి గుడారాల దాకా, అప్పుల దగ్గర్నుంచీ చెప్పుల దాకా ఇతర దేశాల మీద ఆధారపడుతున్నాంగా ... ప్రాణవాయువుని ఎందుకు తెప్పించరూ?"

"అవన్నీ మా చేతుల్లో లేవు గనకా ... నిర్ణయాలు తీసుకునేది వేరేవాళ్లు గనకా "

"మరి మీరేం చేస్తారూ?"

"బిల్లు వేస్తాం"

"దేనికీ?"


" ట్రీట్మెంటుకి"

"ట్రీట్మెంటు ఈ జబ్బుకి లేదంటున్నారుగా?"

"అనేవాళ్ళు అంటారు. మాకెందుకూ?"

"మరి?"

"ట్రీట్మెంటు ఇస్తున్నాంగా!"



"ఏమిచ్చారురూ? ఫలానా టాబ్లెట్లూ ఫలానా ఇంజక్షనూ అవి జబ్బుని తగ్గించలేవని ప్రపంచం కోడై కూస్తూ ఉందిగా?"

"కోళ్లు కూస్తాయి. కూయడం కోళ్ల అలవాటు. వైద్యులు కూయరు. వైద్యం చేస్తారు"

"అదే ఏ వైద్యం?"

"తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పాం. ఇంట్లోనూ బయటా మీరెలాగూ ఆ జాగ్రత్తలు తీసుకోరు గనక మేము దగ్గరుండి మరీ మీరు ఆ జాగ్రత్తలు తీసుకునేలా చేస్తాం. అందుకే చక్కని, సరసమైన బిల్లులు వేస్తాం"

"జబ్బు తగ్గకపోతే? మందే లేనపుడు తగ్గేదెలా?"

"క్రింద వున్నది వైద్యుడు. పైనుండేది నారాయణుడు. ఇక్కడ వైద్యుడి వల్ల కాకపోతే, పైవాడి వల్ల ఖచ్చితంగా అవుతుంది"

"అంటే?"

"అదే!"

""అవునూ... మా ఏడుగురిలో ఒకడ్ని వున్నా డిశ్చార్జి చేశారుగా. మాకు మంచాలూ ఇవ్వకా డిశ్చార్జ్ చేయకా త్రిశంకు స్వర్గంలో పడెయ్యటం ధర్మమేనా?"

"వాడికి జబ్బు వుంది గనక వెంటనే పంపేశాము. లేకపోతే మాకంటుకుంటుంది. మీకసలు జబ్బేలేదు. అందుకే మీకు మంచాల్లేని వార్డులో 'సరికొత్త వేరియంట్' పేరుపెట్టి దర్జాగా ఉంచుతున్నాం"

"మరి మాకు మోక్షమెప్పుడూ? అదే డిశ్చార్జ్ ఎప్పుడూ?"

"ప్రజల్లో పూర్తిగా జబ్బు తగ్గినప్పుడు. ఆక్సిజనూ, మంచాలూ, ఇంజక్షన్లూ, వెంటిలేటర్లూ కుప్పలు కుప్పలుగా దొరుకుతూ, బ్లాక్ లో అమ్మడం పూర్తిగా ఆగిపోయినప్పుడు!"

"అన్యాయం కదూ?"

"అన్యాయం ఏముందీ? అన్నీ తెలిసీ మీరు ఎలక్షను ఊరేగింపుల్లోనూ, వైను షాపుల ముందరా, సినిమా హాలు ముందరా, విజయోత్సవాల్లోనూ, కూరగాయల దగ్గరా, కిరాణాషాపుల దగ్గరా, బస్టాపుల్లో ఇష్టం వచ్చినప్పుడు గొర్రెలు మూగినట్లుగా మూగడంలేదూ? అది అన్యాయం కాదా? మనిషికీ మనిషికీ మధ్య దూరం పాటించమంటే ఒకడి నెత్తిన మరొకడు ఎక్కి కపాల నృత్యం చేస్తున్నారు. పెళ్ళిళ్ళకి మూగొద్దురా అంటే వింటున్నారా? 'ముక్కు గంత'ని వాడుతున్నారా? గీసిన గీతలన్నింటినీ దాటుతూ, ఫెన్సింగుల మీద నించి దూకేస్తూ, టీకాల కోసం తోసుకుంటూ ప్రవర్తిస్తే తప్పులేదు గానీ, ,మిమ్మల్ని హాస్పిటల్లో కూచోబెట్టి ఇంచక్కా బిల్లు వేస్తుంటే తప్పంటారా? అన్యాయం అంటారా?" ఒక్క దులుపు దులిపాడు డాక్టరు.

"పోనీ ప్రజల్లో జబ్బు తగ్గి మేము బయటపడే రోజు ఎప్పుడో చెప్పగలవా?" అడిగారు ఆరుగురూ దీనంగా. "ఓరి పిచ్చివాడా... లోకంలో ఆ విషయం తెలిసిందీ తెలిసేదీ కేవలం రాజకీయ నాయకులకి మాత్రమే. వారెప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో ఆఖరికి వారిని పుట్టించిన భగవంతుడికి కూడా తెలీదు. మాబోటి వాళ్లకేం తెలుస్తుందీ?"

"అంటే?"

"ఎన్నటికీ రైలు పట్టాలు కలవనట్టు, ఏ రెండు గడియారాలూ



ఒకే టైము చూపించినట్టు, వీరు వారినీ, వారు వీరినీ సమాంతరంగా నిందిస్తూనే వుంటారు తప్ప ఇద్దరూ కలిసి ఏ సంయుక్త నిర్ణయమూ తీసుకోరు. భగవంతుడు భేదాల్లోనే వుంటాడని వారి ప్రగాఢ నమ్మకం. వీరు చెయ్యలేదని వారూ, అసలు నిర్ణయాలు వాళ్ళే చేయాలని వీరూ ముప్పు తొలిగిపోయేదాకా తప్పులెన్నుతూనే వుంటారు."

"అయితే?"

"ముప్పు తొలిగిపోయాక, యీ విజయం మావల్లనే అంటే మావల్లనే అని ఇద్దరూ జబ్బలు చరుచుకుంటారు. పత్రికల్లో టీవీల్లో రేడియోల్లో సభల్లో అవిశ్రాంతంగా ఘోషిస్తారు. ఎవరు చేయించుకున్న భుజకీర్తుల్ని వారే తగిలించుకుని మహోత్సాహంగా 'ఇలానే ముందుకు పోదాం' అని ప్రజలకి పిలుపులిస్తారు."

"అప్పటిదాకా?"

"అంటే ఎప్పటిదాకా అనా? ముందే చెప్పాగా! ఆ ముందరున్న మంచికాలం వచ్చేదాకా కడుపులో టాబ్లెట్ కరక్కుండా మీరు బిల్లులు కడుతూ వుండండి. మేము బిల్లులు వేస్తూనే వుంటాము. హాయిగా ఇలా ముందుకి పోతూనేవుందాం"

ఇక చెప్పేదేముందీ .... చేసేదేముందీ!

బై

మీ భువనచంద్ర

# క్షాంతువు బీజము



## ఎలెక్ట్రాన్

విశ్వపతి వృక్షశాస్త్రంలో తన యిరవై నాలుగో సంవత్సరంలోనే మార్గదర్శకుల నిర్దేశ ప్రమేయం అతిగా లేకుండా, స్వయంగా సిద్ధాంతవ్యాసం రాసి నికార్సైన, గౌరవనీయమైన పి.హెచ్.డి సంపాదించిన వెంటనే, అమరావతిలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఉపన్యాసకుడిగా చేరాడు. మూడేళ్లలో తన జన్మస్థలమైన విశాఖపట్నంలోని కృష్ణా ప్రభుత్వ కళాశాలకి బదిలీ అయింది. ఇటీవల బ్యాంకులు ఇంధన వాహనాల కొనుగోలుకి నెలసరి జీతగాళ్ళకి సులువుగా ఋణాలివ్వడంతో, ప్రతి వ్యక్తి వద్దా స్కూటర్ వ్యామోహం తగ్గి మోటార్ సైకిలు కనబడుతోంటే, విశ్వపతికి ద్విచక్రవాహనం లేదా అని అనిపించవచ్చు. ఉండేది. మూడేళ్లక్రితం ఉద్యోగంలో చేరిన రెండో నెలలోనే ఋణం తీసుకొని వెస్పా స్కూటర్ కొన్నాడు. ఇప్పుడు బదిలీ కావడంతో, స్కూటర్ని తను పనిచేసిన కాలేజీలోని ఓ ల్యాబ్ అటెండర్కి అతితక్కువ ధరలో ఇచ్చేశాడు. విశాఖ వెళ్ళిన తర్వాత కొత్త హోండా మోటార్ సైకిల్ కొనుక్కోవచ్చని అనుకొన్నాడు. బ్రహ్మచారి కాబట్టి మూటలు కట్టి లారీలకెక్కించేవారి ప్రమేయం లేకుండానే, కేవలం రెండు స్యూట్ కేసులతో రత్నాచల్ లో ఉదయం ఆరింటికి ఎక్కి, పన్నెండింటికల్లా విశాఖ చేరుకొన్నాడు. తన 27 ఏళ్ల వయసుతో దర్జాగా విశాఖలో అడుగు పెట్టాడు. ఆటో ఎక్కి సీతమ్మధారలోని తమ యింటికి వెళ్ళాడు.

"ఒంటిగా వెళ్ళి ఒంటిగా తిరిగొచ్చావ్, మా నాయనే! నీ కోసం బోలెడు సంబంధాలొస్తున్నాయి. నీ అమ్మానాన్నలు ఏ సమాధానమూ చెప్పలేక, నువ్వింకా వివాహానికి ఒప్పుకోవటల్లేదనే ఓ కుంటిసాకు చెప్పి తప్పించుకొంటున్నారు. నీ మేనమామలిద్దరూ నస పెట్టేస్తున్నారు. త్వరగా ఓ ఇంటివాడవైపోతే నా మునిమనవడికి నీ తాత పేరు పెట్టించి మరీ పోతాను!" అంది నాయనమ్మ సంతోషపడిపోతూ.

అత్తగారి మాటలోని విరుపు విశ్వపతి తల్లి వసుమతికి సూటిగా తగిలింది. ఎందుచేతనంటే విశ్వపతి పితామహుడి పేరు గౌరీపతి. ఆపేరు పెట్టకుండా వసుమతి తన తండ్రి విశ్వపతి పేరు పెట్టేవరకూ భర్తని లోగుట్టుగా వేధించుకు తినేసింది. దానికి ఆమె చెప్పిన బలీయమైన కారణం-తండ్రి తన పేరిట రెండెకరాల భూమి రాయడమే. విశ్వపతి తండ్రి చలపతి స్థిరాస్తితో అడుగుపెట్టిన భార్య పట్టుదలకి తలవంచక తప్పలేదు.

ఓ మంచిరోజు చూసుకొని విశ్వపతి విశాఖకాలేజీ వృక్షశాస్త్ర విభాగంలో చేరినట్లు సంతకం చేశాడు. ఆ విభాగానికి అధిపతి ఏభైయ్యయిదేళ్ల వయసు మీదకొచ్చినా జుట్టుని నెరవనీయని ఆచార్య కళావతి అనే మహిళ. రంగులద్దడంలో బహు నేర్పరి.

"ఏమయ్యా విశ్వపతీ! ఇతరత్రా కాకుండా, కేవలం నా వయసుని మాత్రమే ఓ అధికారంగా లేక సాకుగా తీసుకొని నిన్ను ఏకవచనంలో సంబోధిస్తున్నాను, ఏమీ అనుకోవద్దు మరి!" అందావిడ, విశ్వపతి కాలేజీలో చేరినప్పుడు. అలా కళావతి ఏకవచన సంబోధనకి-అన్యాపదేశంగా తనకున్న రెండు ఆచార్య పట్టాలూ, పాతికసంవత్సరాల పైచిలుకు అనుభవమూ కావన్న ముసుగు మాట.

"పర్వాలేదు మేడమ్! నేను మీకంటే చాలా చిన్నవాణ్ణి. ఆశీర్వదించండి," అన్నాడు విశ్వపతి కాస్త కళావతి కాళ్ళ వైపు వంగి, ఉత్తరాది సంస్కారంతో నమస్కారం చేస్తూ.

విశ్వపతికి మొదటిరోజు క్లాసులోనే, పాఠం బాగా చెప్తాడన్న మాట వచ్చేసింది. రెండు నెలల్లో అదే ఖ్యాతి సుస్థిరపడిపోయింది. కళావతి విశ్వపతికి తన క్లాసులు కూడా అంటగట్టడం మొదలు పెట్టింది. "విశ్వం! చాలాకాలం తర్వాత లండన్ నుంచి మా చెల్లివస్తోంది..కందులపాలెం నుంచి నా స్నేహితురాలొస్తోంది... భీముని పట్నం మా మనవడి పుట్టినరోజుకి వెళ్ళాలి....నీ క్లాసుల కోసం విద్యార్థులందరూ ఎదురు

చూస్తున్నారనుకో! నేను ప్రిన్సిపాల్ గారి చేత మాటలు పడకుండా నా క్లాసులు కాస్త తీసుకో!" అని అధికారపూర్వకమైన అభ్యర్థనలు చేసి, మెరమచ్చు మాటలు చెప్పి, లౌక్యం చూపి విశ్వపతిని ఓ మోస్తరు అదుపులో ఉంచుకొంది. బాగా పనిచేసే మెత్తటి వాళ్లకి బహుమానం మరింత పనేనన్నది తిరుగులేని సత్యం.

ఆ సరికి, విశ్వపతి ముందు బెంచీల మీద కూర్చునే అమ్మాయిల మనసులు దోచుకోసాగాడు. ఇద్దరు ముగ్గురు ధీరయువతులు తమలో తాము పందేలు వేసుకొని, తమ రికార్డు పుస్తకాల్లో ప్రేమలేఖలు పెట్టారు. ఇటువంటి ఉదంతాలు సాధారణంగా జరిగేవే. లేబొరేటరీ అటెండరు మాలాశ్రీ కళావతికి నమ్మినబంటు. విద్యార్థులు ఇచ్చిన రికార్డులను పేజీలు తిప్పి, ఇటువంటి ఉత్తరాల్ని కళావతికి అందజేసేది. కళావతి ఆయా విద్యార్థీ, విద్యార్థిలను సున్నితంగా మందలించేది. మాలాశ్రీ ఈ మారూ అదే పని చేసింది. కళావతి ఆలోచనలో పడింది.

మరో నెలరోజుల్లో కడప ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న నీలావతి అనే డిమాన్ స్ట్రేటర్ బదిలీ మీద విశాఖపట్నం వచ్చి కృష్ణా కాలేజీలో చేరింది. ఆమెదీ వృక్షశాస్త్రమే. చామనచాయలో ఉన్నా, పోతపోసిన నిండైన కాంస్యవిగ్రహంలా బిగువులు సడలని కొట్టొచ్చే రూపం. ఆమె మగ విద్యార్థులను అయస్కాంతంలా ఆకర్షించడం మొదలు పెట్టింది. నీలావతి సొగసుల్ని చూసి అమ్మాయిలూ, స్ఫురద్రూపి అయిన విశ్వపతిని చూసి అబ్బాయిలూ మనసుల్లో అసూయలు పెంచుకోనారంభించారు.

ఓ రోజు కళావతి తన పుట్టినరోజు సందర్భంగా ఇంట్లో ఏర్పాటుచేసిన విందుకు తన విభాగంలోని స్టాఫ్ మెంబర్లనందరినీ పిలిచింది. కళావతి భర్త మంగపతి బహు చతురుడు. ఆయన పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్. రెండు పెగ్గులు బయటి వరండాలో బిగించి, లోపలికి వచ్చాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ, "ఏమోయ్ కళా! నీ సెక్షన్ లో అందమైన జంటలు వచ్చి చేరుతున్నారు. విద్యార్థుల హాజరీ ఎంత శాతం పెరిగిందో గణాంకాలు తీశావా?" అన్నాడు.

హాల్లో ఉన్న అందరికళ్ళూ విశ్వపతి వైపూ, నీలావతి వైపూ టీవీ ప్రసారవాహినుల ధారావాహికల్లోని పాత్రల విస్ఫారిత నేత్రాలవలె తిరిగి తిరిగి, వారిద్దరి మనసుల్లోనూ ప్రేమ బీజాలు నాటేశాయి. మర్నాటి సాయంత్రానికల్లా ఇటీవలి కాలంలో వార్తాప్రపంచం తనిష్క-సుభాంశుల ప్రేమోదంత, వివాహపు వార్తలను వెదజల్లినట్లుగా, ఊహాగానాలు కాలేజీ అంతా వ్యాపించేశాయి. టాలీవుడ్ హీరో కోలీవుడ్ హీరోయిన్ని ప్రేమించి మాల్దీవులలో పెళ్లిచేసుకొంటే, ఆ వార్త విన్న అభిమానులు చందాలేసుకొని మునగపాడులో టపాసులు కాల్చే రోజులు మరి.
విద్యార్థులు ఆ రోజుకోసం ఎదురుచూడ సాగారు.
"అయిన ముద్ర ఎలాగూ పడింది సర్! సంద్రమంటే ఏమో తెలియని కడప జిల్లా వాసిని. కాస్త అలా కైలాసగిరి పైనుంచి చూసి వద్దాం" అంది ఓ రోజున నీలావతి. విశ్వపతి కాదనలేకపోయాడు. అప్పటికింకా మోటార్ బైకు కొనలేదు. అందుకని కైలాసగిరి దిగువవరకూ ఆటోలో వెళ్ళి, అటుపైన కొండపైకి కేబుల్ కారులో వెళ్లారు. అలా అలా మొదలైన నీలావతీ విశ్వపతుల హుషారు విహారాలు రామకృష్ణ సముద్రతీరాన ఇసుకలో నిలబెట్టిన జలాంతర్గామి వద్దకు, విశాఖలోని మహాదుకాణ సముదాయాలకీ, బహుళ తెరల చలనచిత్ర మందిరాలకీ విస్తరించాయి. దశపల్లా హోటల్లో టిఫిన్లు చేస్తూ చాలామంది విద్యార్థుల కళ్ళలో పడ్డారు. వారిద్దరూ ప్రేమికులన్న సమాచారం బలపడిపోయింది

ఓ రోజు కళావతి విశ్వపతిని తమ ఇంట రాత్రి భోజనానికి పిల్చింది. కళావతి భర్త మంగపతి, భోజనాల బల్లదగ్గర నీలావతిని గురించి కొన్ని వివరాలు చెప్పాడు. చెప్పాడు అనడం కంటే, కళావతి చెప్పించింది అనడం సబువు. "ఆమె ఇరవై సంవత్సరాలకి బి.ఎస్సి. ప్యాసైంది. కాలేజీ లో చిన్న ఉద్యోగంలో చేరింది. పై చదువులకు, వివాహ కాలయాపనకు ఇష్టం లేని తల్లిదండ్రులు వివాహం చేసేశారు. అత్తింట్లో అడుగు పెట్టేనే ఆరళ్ళు ప్రారంభమైయ్యాయి. ఏడాది దాటేసరికి పండంటి కూతురు పుట్టింది. అయినా భర్తా, అత్తమామల తీరు ఏమాత్రం మారలేదు. కూతుర్ని కన్నందుకు ఆడిపోసుకున్నారు. నీలావతి భర్త కూతురన్న జాలి కూడా లేకుండా పాపని దగ్గరకు రానిచ్చేవాడు కాదు. ఏ చిన్నవంక దొరికినా

డొంకలు పీకి, హద్దులు మీరి నీలావతిని అవమానం చేశారు. విసుగెత్తి విడాకులు తీసుకొంది. కూతురుతో సహా తల్లిదండ్రుల పంచన చేరింది. నువ్వు నీలావతిని వివాహం చేసుకొంటే సమాజం హర్షిస్తుంది. నీలావతితో నా శ్రీమతి మాట్లాడింది. ఆమె వివాహానికి సుముఖంగానే ఉంది. మీరు ప్రేమించుకొన్నారని కాలేజీ అంతా కోడై కూస్తోంది. ఆ కోడిఅరుపుల్ని కోయిలరాగాల్లా మార్చుకొనే ఇది మీ యిద్దరి చేతుల్లోనే ఉంది. ఏమంటావ్?" అని ముగించాడు.

విశ్వపతి ఒక అయిదు నిముషాల పాటు సమాధానమివ్వక, విశాఖ బిర్యానీ తింటూ ఆలోచించి అన్నాడు. "మంగపతిగారూ! మీరే ముందస్తుగా తెలిసో, తెలియకో ఓ ప్రేమోద్భవనకు అంకురార్పణ చేసేశారు. అయితే నీలావతి నాతో తనని గురించి ఏమీ చెప్పలేదు. ఏదో కలిసి తిరగడమే తప్పించి, ఒకరి ప్రేమను మరొకరం మౌఖికంగా వ్యక్తం చెయ్యడం జరగలేదు. మీరిప్పుడామె దీనగాథని చెబ్తోంటే ద్రవరూపంలో ఉన్న నా ప్రేమ ఈ క్షణంలోనే ఘనీభవించినట్లనిపిస్తోంది. అయితే ఒక్క సహాయం చెయ్యాలి. మీరిద్దరూ నా తల్లిదండ్రులతో మాట్లాడి ఈ వివాహానికి ఒప్పించండి. మా నాన్న సంస్కారవాది. సులువుగా ఒప్పుకొంటాడు. మా నాయనమ్మ నా మాట కాదనదు. అయితే పాప పేరుమట్టుకు మా నాయనమ్మ పేరుకి మార్పించాలి! అన్నట్టు మరొక్క సంగతి. మా అమ్మతరపు బంధువులందరూ ఛాందసతత్త్వం కలిగినవారు. నా మేనమామలకిద్దరికీ వివాహవయస్కులైన కూతుళ్ళున్నారు. వాళ్ళు బంధుత్వాల పేరిట మా అమ్మ మీద మనోవైజ్ఞానికమైన ఒత్తిళ్ళు తీసుకువచ్చి పేచీలు పెట్టొచ్చు. అందుకని బ్రాహ్మడు పెట్టిన ముహూర్తానికి రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళి పెళ్ళి చేసేసుకొంటే, తర్వాత ఎవరేం ఏడ్చుకొన్నా పర్వాలేదు!"

"నీలావతి తరపున కూడా ఇటువంటి సమస్య రావొచ్చు. అయిపోయిన పెళ్ళికి చట్ట వాయిద్యాలెందుకన్నట్లుగా నీవన్నమాట సబువుగానే ఉంది. మేం దగ్గరుండి సాక్షి సంతకాలు చేస్తాం," అని భరోసా యిచ్చారు కళావతీ, మంగపతులు.


మంగపతీ, కళావతులు వెళ్ళి చలపతీ, వసుమతిలతో మాట్లాడారు. అట్టే బెట్టుపోకుండా వాళ్ళు తమ సమ్మతి తెలియజేశారు. ముహూర్తం కుదిరిన రోజున పదకొండింటి కల్లా ఇరువైపులవారూ రిజిస్ట్రార్ ఆఫీసు చేరారు. అందరూ కలిసి పదిమంది లోపే. ముందస్తుగా ఓ గుమాస్తా హాల్లోకి వచ్చి, ఆరోజు వివాహం చేసుకోదలచిన మొత్తం అయిదు జంటలకి ఫారాలిచ్చి పూర్తి చేయమన్నాడు. ఒక్కో జంటకీ అయిదారుగురు గుంపు ఉంది. ఆ జంటల్లో రెండు జంటలు లేచిపోయిన బాపతు. రెండు జంటలు పేదలు. ఖర్చులు భరించలేక ఈ మార్గం ఎన్నుకొన్నారు. తర్వాత ఒక్కొక్క జంటా తమ గుంపుతో లోపలికి సంతోషంగా వెళ్ళి, రిజిస్ట్రారువారి ముందు సంతకాలూ అవీ చేసి, దంపతులైనట్లు ధ్రువపత్రంతో మరింత ఆనందంగా తిరిగి బయటకి వచ్చింది. విశ్వపతి పిలుపు ఆఖరిగా వచ్చింది. విశ్వపతి, అతని తల్లిదండ్రులూ, నీలావతి, ఆమె తల్లి దండ్రులూ, కళావతి మంగపతిలూ, మాలాశ్రీ లోపలికి వెళ్లారు. నీలావతి తల్లి వేదవతి చంకలో ఉన్న అయిదేళ్ళ పాప గింజుకొంటూ కిందకి దిగి, "నాన్నా!" అంటూ, పరిగెత్తుకు వెళ్ళి మేరేజ్ రిజిస్ట్రార్ ఒడికెక్కి, మెడచుట్టూ చేతులు వేసి ఏడవసాగింది. "ఎలా ఉన్నావమ్మా బిడ్డా?"అంటూ రిజిస్ట్రార్ పాప బుగ్గలమీద ముద్దులు కురిపించ సాగాడు.

కళావతి మొహం కళావిహీనమైంది. నీలావతి బిత్తరపోయి చూసింది. ఆ తండ్రీ కూతుళ్ల అనురాగబంధం కళ్ళారా చూసిన విశ్వపతికి కళావతీ, మంగపతుల కట్టుకథనం కొట్టొచ్చినట్లు కనబడింది. కన్నతల్లి పేగుబంధమెంత బలీయమైనదోనన్న సహజ సామాజికచిత్రణ వెనుక, కన్నతండ్రి బీజబంధం కూడా అంతే బలీయంగా ఉంటుందని విశ్వపతి గ్రహించాడు. కళావతి నల్లరంగు జుట్టులాంటి నిజంలోంచి తెల్లవెంట్రుకలాంటి కల్ల కనబడింది. నీలావతి విడాకుల కథనం వెనుక మరేదైనా బలీయమైన కారణం ఉండి తీరాలనిపించింది.

విశ్వపతి మౌనంగా వెనుదిరిగాడు. లోపలినుంచి పాప కిలకిలలు వినవస్తూనే ఉన్నాయి.

***

# వేదులాన్వయు పలుకు -3



వేదుల సుబ్రహ్మణ్యం

ఇంతి నెంతగా పొగడిన నంత మేలు
కోరి వాదన కొనితెచ్చు కొనగ రాదు
కొరివితో తన తలగోకుకొనుట తప్పు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 61

భర్త కట్టిన తాళిని భద్ర పరచి
'బాంకు లాకరు' నందుంచు భాగ్యమునకు
లాకరెంతగ నోచెనో మోకరిల్లి !
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 62

బాంకు 'లాకర' నీదిగా భాగ్యమనగ !
పసిడి మేలిమి 'బిస్కట్లు' మిసిమి గొల్పి
నగల గుట్టలు నీకుక్షి సొగసు పెంచు
తెలుపు నలుపను భేదము తెలియకున్న
నోట్ల కట్టలు కుక్కిన నొచ్చు కొనునె
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 63

పరుల శ్లాఘించి తనవారి పరిహసించి
చులకనగ మాటలాడుట సొంపు కాదు
మెచ్చదగువారి నెపుడైన మెచ్చదగును
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 64

మూఢ నమ్మక మది యెల్ల ముదిరిపోయి
మలినమై బుద్ధియింకను మందగింప
చేయు పనులందు విజ్ఞత మాయ మగును
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 65

స్ఫూర్తి నిచ్చెడి వ్యాఖ్యలు, సూక్తిసుధలు
సామరస్యముతో నిండి సరస మొప్పి
సద్గుణమ్ములు పెంపొంద సాయపడును
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 66

మంచి చేసిన వానికి మంచి చేసి
చెడును చేసెడు వానికి జెప్పుటొప్పు
ఇద్దరకు కల్గు మేలప్పు డెల్లవేళ
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 67

ఆది మధ్యాంత రహితుడౌ హరిని దలచి
మదిని తిరముగ నిల్పిన ముదము గలుగు
భక్తితో గొల్చి ధ్యానింప ముక్తి కలుగు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు
68

పూర్వ జన్మల జేసిన పుణ్య ఫలము
సజ్జనుల సహవాసము సహకరించి
మనిషి సంస్కారవంతుడై మనగ నేర్చు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 69

శివుడె విష్ణువు విష్ణువే శివుడు కాగ
ఒకరు మరియొక రూపమై యుండి విశ్వ
మందు నెల్లర బ్రోచుచు నుందురెపుడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 70

# పూరి జగన్నాథ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమై నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్త్యాన్ని యధామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

28 వ అధ్యాయం

జైమిని ఋషి సంవాదం

(బ్రహ్మ నృసింహుని స్తుతించుట)

బ్రహ్మాది దేవతలు నీలాచల పర్వతంనుండి బయలుదేరారు. మంత్ర మహిమ వలన నృసింహుడు ఉగ్ర రూపంలో ప్రత్యక్షమయ్యాడు. స్వామి రూపాన్ని చూసి ప్రద్యుమ్నాదులు నిశ్చేష్టులయ్యారు.

“తండ్రి! ఇప్పుడు స్వామి ఉగ్రరూపంలో ఎందుకు ప్రత్యక్షమయ్యారు?ఈ రూపం భయాన్ని కలిగిస్తోంది. నీవుమాత్రమే స్వామి లీలలను అర్థం చేసుకోగలవు” అని నారదుడు ప్రశ్నించాడు.

“నారదా! దారుమయమైన ఈ శిల్పాలను కొందరు సరిగా అర్చించక, స్వామి మహిమ తెలుసుకోవడానికి, మంత్రరాజమైన ఉగ్రనరసింహ మంత్రాన్ని అభిమంత్రించారు. అందువలన స్వామి హిరణ్యాక్షుని సంహరించిన రూపంలో ప్రత్యక్షమయ్యారు, స్వామి రూపాలలో ఇది శ్రేష్టమైనది. ఈ రూపంలో స్వామిని అర్చిస్తే తిరిగిరాని లొకాలకు చేరుకుంటారు.” అని బ్రహ్మపలికి స్వామిని ఈ విధంగా స్తుతించారు.

బ్రహ్మ నృసింహ స్వామిని స్తుతించుట--------

నమో&స్తుతే దేవవరైక సింహ



నమో&స్తు పాపౌఘ గజైక సింహ

నమో&స్తు దుఃఖార్ణవ పార సింహ

నమో&స్తు తే క్లేశ విముక్తి సింహ

నమో&స్తు తే దైత్య విదారసింహ

నమో&స్తు దేవేష్వధి దేవ సింహ

నమో&స్తు వేదాంతవనైక సింహ

నమో&స్తు తే యోగి గుహైక సింహ

నమో&స్తు తే సింహ వృషైక సింహ

నమో&స్తు నీలాచలశృంగ సింహ.

నృసింహ రూపంలో ఉన్న ఓ దేవదేవా! పాపాలనే ఏనుగులకు సింహము వంటివాడా! దుఃఖము అను సముద్రాన్ని దాటించువాడా! తేజోమయ రూపాన్ని ధరించినవాడా! అన్ని రూపాలను ధరించిన వాడా! కష్టాలనుండి ముక్తి కలిగించినవాడా! దివ్య శరీరం కలవాడా! వీరులలోఉత్తమమైనవాడా! దైత్యుని చీల్చినవాడా! దేవాధిదేవా! వేదాంతము అను వనంలో సింహము వంటి వాడా! యోగుల హృదయాలనే గుహలో సింహము వంటి వాడా! సింహాలలో ఉత్తమమైన సింహ రూపం కలవాడా! నీలాద్రి పర్వతంపై నివసించువాడా! ఓస్వామి! నీకు నమస్కారం. (1- 17)

ఈ విధంగా బ్రహ్మ స్వామిని స్తుతించాడు. సింహ యంత్రాన్ని వ్రాసి, దానిపై వైష్ణవ మంత్రాన్ని ఆవాహన చేసారు.నాలుగు వేదాల సారం ఆమంత్రంలో ఉంది. ఈ మంత్రప్రభావంతో స్వాయంభువ మనువు సృష్టిని చేసాడు.నాలుగు పురుషార్థాలను పొందవచ్చు. యజ్ఞ ఫలాన్ని ఇస్తుంది. సమస్త తీర్థ ఫలాన్ని, దాన ఫలాన్ని, వ్రత ఫలాన్ని ఇస్తుంది. సమస్త పాపాలు నశిస్తాయి. భవ రోగాలనుండి ముక్తి పొందవచ్చు. గ్రహబా ధలు పోతాయి

బ్రహ్మ ఇంద్రద్యుమ్నునికి నృసింహ మంత్రాన్ని ఉపదేశించాడు.ఆ మంత్రప్రభావం వలన నరసింహ స్వామి రాజుకి ఈ విధంగా కనబడ్డాడు. శాంతస్వరూపుడైన నృసింహుని వక్షస్థలముపై లక్ష్మీదేఉంది. చక్రము, పినాకము ధరించి ఉన్నాడు. సూర్యుడు,చంద్రుడు, అగ్ని కన్నులుగా ఉన్నారు. ముప్పైరెండు దళాలు ఉన్న యోగ పట్టాపై మంత్రవర్ణాలు కలిన దీర్ఘ కర్ణికల మధ్య స్వామి లక్ష్మీ దేవి ముఖాన్ని చూస్తూ ఉన్నాడు. బలభద్రుడు తన పడగలతో గొడుగు పట్టి ఉన్నాడు. అటువంటి దివ్య స్వరూపంతో ఉన్న స్వామిని చూసి రాజు ఆనందించాడు. ( 18 - 32 )




“ స్వామి చరిత్ర చాల ఆశ్చర్యంగా ఉంది.రథంపై నాలుగు రూపాలలో ఉన్నస్వామి ఇప్పుడు ఒకే రూపంలో ఉన్నాడు.రథంలో ఉన్నరూపాలను మందిరంలో ప్రతిష్టించమని ఆకాశవాణి చెప్పింది.ఇది నిజమా?కలా అని రాజు బ్రహ్మను అడిగాడు.

బ్రహ్మ చిరునవ్వునవ్వి”ఓరాజా! స్వామి రూపాలలో ఈ నృసింహాకృతి మొదటిది.ఈ ప్రతిమ సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపం.అఖండఆనందాన్నిఇస్తుంది.ఈస్వామి నాలుగు వేదాలను అనుసరించి జగత్తును సృష్టించి, తనను తాను సృష్టించుకున్నాడు. శబ్దబ్రహ్మ,పరబ్రహ్మ వేరుకాదు.ప్రళయ సమయంలో రెండు రూపాలు ఒకటే అవుతాయి. శబ్దార్థాలు వేరు కాదు. రెండు కలిసే ఉంటాయి. వీటినుండి వేదాలు పుట్టాయి. బలరాముడు ఋగ్వేద రూపం.సుభద్ర యజుర్వేదరూపం.నరసింహుడు సామవేద రూపం.సుదర్శనం అధర్వణ వేదరూపం. ఈ నాల్గు వేదాలు ఒక్కటే. అలాగే స్వామి నాలుగు రూపాలలో ఉన్న అసలు స్వరూపం ఒక్కటే.స్వామిని ఎవరు ఏవిధంగా భావిస్తే స్వామి ఆవిధంగాకనబడతాడు. బంగారం ఒకటే అనేక ఆభరణాలుగా మారినట్లు స్వామి అనేక రూపాలలో కనబడతాడు.ఎంతభక్తితో ఆరాధిస్తే అంత ఫలితాన్ని ఇస్తాడు.

విశుద్ధమైన అంతరాత్మతో స్వామిని ఆరాధించు. నీకు ఉపదేశించినమంత్రంతో స్వామినిఆరాధిస్తే ధర్మాది చతుర్వర్గాలుసాధించవచ్చు.స్వామి ప్రీతి పొందుతాడు. వైకుంఠ నివాసం లభిస్తుంది. యజ్ఞయాగాదులు చేయ వలసిన పనిలేదు. ఈ స్వామిని ఉపాసిస్తే చాలు. ముక్తి లభిస్తుంది. ( 33 - 56 )

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలో పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంలోని జైమిని- ఋషి సంవాదం అను ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

(ఇంకా వుంది)

# సప్త మోక్ష నగరాలు



కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పరమావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్థ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహకరించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తాడు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయడానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప్త నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్షదాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప్త మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని ) మరియు ద్వారక.**

# కాశీ మహానగరం

మన దేశ ప్రధానమంత్రి మోడీ గారు విశ్వనాథ ఆలయం, దాని పరిసరాల రూపురేఖలు మారుస్తున్నారు. గుడి చుట్టూ మాడ వీధులు, ఉపాలయాలు ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని అత్యంత సుందరంగా తీర్చి దిద్దే ప్రణాళికలు అమలు చేస్తున్నారు. మున్ముందు ఆలయ సమీపంలో సందులు, చెత్త కనిపించవు.

అన్నపూర్ణ ఆలయం:

కాశీ విశ్వనాధుని ఆలయానికి ఎదురుగా అన్నపూర్ణేశ్వరి ఆలయం ఉంది. ఈ ఆలయం ఉత్తర భారత శైలిలో నిర్మింపబడింది. గర్భ గృహంలో కొలువైన అన్నపూర్ణమ్మ తల్లి కూర్చున్న పీఠం క్రింద జగద్గురు ఆది శంకరాచార్యులు వారు ప్రతిష్టించిన శ్రీ చక్రమున్నది. అమ్మవారు పీఠంపై కూర్చుని ఉంటారు. అమ్మ వారి ఎడమ చేతిలో పాయసం పాత్ర , గరిటెను తిలకించవచ్చును. మహిళా భక్తులు చాలా మంది అమ్మ వారికి పసుపు కుంకుమలు, వడి బియ్యాన్ని సమర్పిస్తారు. చూడ వచ్చిన భక్తులందరికీ పూజారులు బియ్యాన్ని ప్రసాదంగా ఇస్తారు. వాటిని ఇంటికి పవిత్రంగా తీసుకు వెళ్లి పాయసంలో కలిపి భుజిస్తారు. కొందరు ప్రసాదంగా లభించిన బియ్యాన్ని బియ్యం నిల్వ చేసే డబ్బాలో ఉంచుతారు. అలా చేస్తే ఆ బియ్యం డబ్బా అక్షయ పాత్ర గా మారి పోతుందని నమ్ముతారు.



గర్భ గృహంలో బయట ఉన్న 12 స్తంభాలతో కూడిన మండపం గుండా అమ్మవారి దర్శనం సంతృప్తి గా చేసుకోవచ్చును. ఈ మండపంలో కుంకుమ పూజలు పూజారులు మహిళలతో చేయిస్తారు. ఈ మండపం చుట్టూ ఆలయం ప్రక్కనే ఉన్న మరో ప్రాంగణంలో అనేక ఉపాలయాలు ఉన్నాయి. గర్భ గృహానికి బయట కాళీయ మర్దన శ్రీ కృష్ణ పరమాత్మ, గజ లక్ష్మి దర్శనమిస్తారు. అమ్మ వారిని దర్శించుకుని బయటకు వస్తే ఒక పెద్ద గంట కనపడుతుంది. ఆలయ ప్రధాన మండపం ఎడమ పక్క సొరంగంలా ఉన్న ప్రాంతంలో శక్తి వంతమైన యంత్రేశ్వరుడు లింగ రూపంలో కొలువై దర్శనమిస్తున్నాడు. ఈ లింగానికి అగ్ర భాగంలో ఓ శ్రీ చక్రం ప్రతిష్టించబడిందిట.

ఈ ఆలయంలో మరో విశేషం భక్తులు చూడగలుగుతారు. అది



బంగారు అన్నపూర్ణమ్మ దర్శనం. ఆలయ మొదటి అంతస్థులో కొలువైన ఈ అన్నపూర్ణమ్మ తల్లి నరక చతుర్దశి రోజున భక్తులకు దర్శన భాగ్యం కలుగ జేస్తారు. బంగారు ఆభరణాలతో కూడిన అమ్మ విగ్రహాన్ని దీపావళి రోజున దర్శనం చేసుకోవచ్చును.

అమ్మ వారి సుందర రూపాన్ని దర్శించి తన జీవితం ధన్యమైనదని భావిస్తారు. ఆది శంకరాచార్యుల వారు అన్నపూర్ణ తల్లిని దర్శనానంతరం అన్నపూర్ణాష్టకాన్ని భక్తుల కోసం రచించారంటారు. ఆమెను పూజించి, ఈ అష్టకాన్ని పఠిస్తే, ఆ గృహంలో అన్న పానీయాలకు ఎట్టి లోటు ఉండదు.

ఈ ఆలయంలో ప్రతీ రోజూ ఆలయ నిర్వాహకులు వందలాది భక్తులకు అన్న ప్రసాదాన్ని ఆలయ మొదటి అంతస్థులో వితరణ చేస్తారు. అమ్మ కృప పొందుటకు ఇక్కడ భోజనం చేయుటకు సంసిద్ధులౌతారు. షడ్రసోపేతమైన భోజనాన్ని ఆలయ వాలంటీర్లు భక్తులందరికీ వడ్డిస్తారు.

భక్తులైన నారాయణ దీక్షితులు అనే ఆయన ఇంట అన్నపూర్ణమ్మ వచ్చి ఆనాడు అతని ఇంటికి వచ్చిన సాధు సన్యాసులందరికీ తన స్వహస్తాలతో రక రకాల వంటలు వండి తృప్తిగా వడ్డించింది. ఆమె ఆదేశం ప్రకారం నారాయణ దీక్షితుల వారు ఓ చిన్న ఆలయాన్ని నిర్మించారు. ఇప్పటికీ కాశీలో ఈ ఆలయాన్ని చూడవచ్చును. నిన్న , నేడు రేపు అన్న తేడా లేకుండా అందరినీ పాలించే ఆ చల్లని తల్లి కాశీ నగరంలో అన్న పూర్ణేశ్వరిగా వెలసి భక్తులను పాలిస్తోంది.

గంగా నది ఒడ్డున వెలిగి పోతున్న కాశీ నగరంలో ఆ తల్లి ఆది శక్తి విశాలాక్షి, దుర్గా వారాహి అంటూ వివిధ రూపాల్లో దర్శన మిస్తున్నప్పటికీ అన్నపూర్ణమ్మ అగ్ర స్థానంలో ఉంది. కాశీ నగరాన్ని కాపాడుతోంది.ఒక్క కాశీ మహా నగర మేమిటి ? ఈ సమస్త విశ్వాన్ని రక్షిస్తూ ఉంటుంది. ఆ తల్లి చల్లని చూపుల వల్లనే కదా!

అన్నదానానికి మించిన దానం లేదు ఆకలితో అలమటించే వారికి అన్నం పెట్టాలి ధన సహాయం కంటే అన్న దానం రూపంలో కడుపు నిండా బోనం పెట్టి ధర్మాన్ని కాపాడాలి. అన్నదానం వల్ల దాతకు కీర్తి, యశస్సు, తేజస్సు, బలం సమకూరుతాయి.

కాశీ విశాలాక్షి ఆలయం:

కాశీ విశ్వేశ్వరుడి దేవాల-




యానికి కొద్దీ దూరంలో తూర్పు వైపున కాశీ విశాలాక్షి ఆలయం ఉంది. అష్టాదశ శక్తి పీఠాలలో పదిహేడవ క్షేత్రంగా అలరారుతున్నది. ఇక్కడ సతీ దేవి కుడి కన్ను పడిందని కొందరు, ఎడమ చేయి పడిందని మరికొందరు అభిప్రాయ పడతారు.

ఒకప్పుడు బ్రహ్మ దేవుడు భూలోకాన్ని పరిపాలించేందుకు నియమించిన దివోదాసు అనే రాజు తాను రాజ్యం చేయాలంటే దేవతలంతా భూమిని విడిచి పోవాలని షరతు విధించాడు. ఆ షరతుకి లోబడి శివుని కూడా కాశీ వదిలి వెళ్లి పోవాలని షరతు విధించాడు. ఆ షరతుకి లోబడి శివుడు కూడా కాశీ వదిలి వెళ్లి పోయాడు. అయితే శివుని ఎడబాటు భరించ లేక తిరిగి రావాలని వినాయకుని దూతగా పంపి , దివో దాసు తిరిగి శివుని రమ్మనమని ఆహ్వానించాడు. మహానంద భరితుడైన నీల కంఠుడు పరివార సమేతంగా కాశీకి విచ్చేయగా గౌరీ మాట కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ కాశీలో ప్రవేశించి, మహా శక్తిగా నిలిచిందట. అందుకే ఆమెను విశాలాక్షి అని పిలుస్తారు.

ఈ ఆలయంలోని రాతి విగ్రహం స్వయంభువు. కొన్నాళ్ల తర్వాత కంచి పీఠాధిపతి బంగారు విగ్రహాన్ని ప్రతిష్ట చేశారు. ఒక పక్క నుండి చూస్తే మనకు రెండు విగ్రహాలు మనకు ఒకదాని వెనుక ఒకటి కనపడతాయి. భక్తులు ముఖ్యంగా అమ్మవారికి పసుపు కుంకుమ చీర గాజులు సమర్పించి తమకు సిరి సంపదలు, మాంగళ్య బలాన్ని ఒసగమని వేడుకుంటారు. పూజారి ఇచ్చే కుంకుమను, గాజులను సవీకరించి వెనుతిరుగుతారు. శక్తి స్వరూపిణి ఆ విశాలాక్షి దేవికి, అన్నపూర్ణమ్మకు వేరు వేరు దేవాలయాలు ఉండడం వల్ల వారి వేరు వేరు దేవతలుగా పరిగణింప బడుతున్నారు. విశాలాక్షి శాంతి స్వరూపిణి. ఒక చేతిలో త్రిసూలం మరో చేతిలో ఢమరుకం ధరిస్తూ భక్తులకు దర్శనమిస్తుంది.

(ఇంకా వుంది)

# నూటపదహార్లు కందాల్లో
# సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అద్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

49) ఘోర పరాజయము జరిగి
కోరలు పోవగ గతంబు గుర్తుకు వచ్చెన్
వీరుడ వినుమని చెప్పెను
ఆ రాముడు వచ్చును తన యాలిని బొందున్

49. "ఓ మహా వీరుడా! విను. నన్ను చంపగలిగి కూడా చంపకుండా వదిలి పెట్టావు. నీ రాముడు తప్పక వస్తాడు. రావణున్ని చంపి సీతను తనతో తీసుకువెళ్తాడు.

50) పరమేష్టి వరమిది చెడునె
కరము దయాళుడవు నన్ను కాపాడితివే
చొరబడు లంకను వెంటనె
సురవైరి మదమునడంచు శూరుడ వీవే

50. ఇది రావణుడికి బ్రహ్మ ఇచ్చిన శాపం. జరిగి తీరుతుంది. అనుభవించక తప్పదు. ఇంక నువ్వు స్వేచ్ఛగా లంకలో ప్రవేశించు." అని చెప్పి వెళ్ళిపోయింది.

51) ఇంతలొ వెన్నెల విరిసెను
అంతటి బాహుబలి పిల్లి యంతయి దూరెన్
గెంతిన సవ్వడి నెవ్వరు
సుంతయు వినరాక భటుల సుళువుగ దాటెన్

51. ఈ లోగా సూర్యాస్తమయం అయి, వెన్నెల వచ్చింది. ఇదే సమయం అని హనుమంతుడు పిల్లి అంత అయి. కాపలా వాళ్ళ కంట పడకుండా నగరంలోకి ప్రవేశించాడు.

52) పావని వీధుల దిరుగుచు
రావణుడుండు నిజమందిరంబును చేరెన్
కావలి యుండిరి నాలుగు
దోవల దూరగ వశంబె దోమకు నైనన్

52. అలా వీధుల్లో తిరుగుతూ సీతామాత కోసం గాలించ సాగాడు. రావణుడు ఉండే మందిరానికి చేరుకున్నా-డు. ఆ మందిరంలో దోమ కూడా దూరడానికి అవకాశం లేకుండా భటులు కాపలా ఉన్నారు.

53) మదవతులు మదిర తాగుచు
ఎదపై పయ్యట సడలగ నేమార్చిరిగా
సదనమున కలియ దిరుగుచు
మదమెక్కిన మత్తులోన మానినులంతా

53. అక్కడ కొందరు రాక్షస స్త్రీలు మద్యపాన మత్తులై వంటిమీద బట్టలున్నయోలేదో కూడా తెలుసుకోలేని స్థితిలో తిరుగుతూ కనిపించారు.

54) చీరలు చెదిరిన తెలియరు
తీరని తాపము దహించ తీయని కలలన్
మారుతి కర్మము జాలక
వారల జూడగ బిడియము భయమును పడియెన్

54. కొందరైతే నిద్ర మత్తులో మదన తాపం ఓర్వలేక కలలలోనే కలవరిస్తున్నారు. మారుతికి ఆ దృశ్యం చూడడా-నికే అసహ్యం వేసింది. కొంచెం భయ పడ్డాడు కూడా

55) ఇచ్చట నెందుకు జొచ్చితి?
ఇచ్చోటున సీతయుండు నేగతి యనుచున్
అచ్చోటు విడిచి పోయెను
అచ్చట నొక మేడగాంచి అబ్బుర పడియెన్

55. నా ఖర్మ కాలి ఈ మందిరం వైపు వచ్చాను. ఇటువంటి నీచమైన స్థలంలో సీతమ్మవారు ఎలా ఉంటారు? మరొక చోట వెదకాలి అనుకుంటూ ముందుకు నడిచాడు.

56) కాంచన మయంబు సౌధము
కాంచనమే కానిపించె కాంచగ నౌరా!
కాంచన వర్ణపు శయ్యను
కాంచనమును బోలు మగువ కానగ వచ్చెన్

56. అక్కడొక దగ్గర బంగారంతో మెరిసి పోతున్న అందమైన మేడ చూశాడు. ఆ మేడలో బంగారు మంచం మీద, బంగారు వన్నెలో మెరిసిపోతున్న ఒక స్త్రీ హాయిగా నిద్రపోతున్నట్టు గమనించాడు.

(సశేషము)

# గ్రీసు దేశపు పురాణ గాథలు


## వేమూరి వేంకటేశ్వరరావు




**“Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence.”**
**Aldus Huxley. “Knowledge and Understanding”**

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, “మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి,” అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా “ఇరవై నిమిషాల కార్యక్రమం” చూద్దామని వెతకడం ఉపక్రమించేను. “అపస్వరం అనే ఏపిల్ పండు కథ” ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.

పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, “చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను” అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.

ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 9. ఇలియాడ్: సంగ్రహంగా

భారతీయ వాంగ్మయంలో భారతం ఎటువంటిదో పాశ్చాత్య వాంగ్మయాలకి ఇలియాడ్ అలాంటిది. గ్రీకు భాషలో "ఇలియాస్" అంటే ట్రోయ్ అనే అర్థం ఉండడం గమనార్హం!

హోమర్ రాసిన ఇలియాడ్ లో కథనం గ్రీసు సేనలకి, ట్రోయ్ సేనలకి మధ్య యుద్ధం తొమ్మిదో సంవత్సరంలో ఉండగా మొదలవుతుంది. అనగా యుద్ధం చివరి దశలోఉండగా కథ మొదలవుతుంది; భారత కథ జనమేజయుని సర్పయాగంతో మొదలయినట్లు!

కవి సాహిత్యాధి దేవత అయిన "మూజ్" ని ప్రార్థించి గ్రీకు యోధులలో అగ్రేసరుడైన అఖిల్లీస్ కోపోద్రేకాలకి కారణమేమిటో చెప్పడంతో గ్రంథ రచన ప్రారంభం అవుతుంది. ఈ అఖిల్లీస్ తండ్రి పెలియస్ (ఒక కులీన రాజ వంశీయుడైన మానవుడు), తల్లి థేటిస్ (దైవగణాలకి చెందిన ఒక జలకన్య). ఇలియాడ్ లో వచ్చే పాత్రలలో అత్యధికులు గ్రీసు దక్షిణ పరగణాల నుండి వచ్చిన వారైతే ఒక్క అఖిల్లీస్ మాత్రం ఉత్తరాదివాడు. అనగా ఒక విధంగా "పరాయి" వాడు. యవ్వనం, పరాక్రమం అతని భూషణాలు అయితే కూటనీతి, మంత్రాంగం తెలియని ఉడుకు రక్తం అతని శత్రువులు. అఖిల్లీస్ కీ మరొక గ్రీకు మహారథుడైన అగమేమ్నాన్ కి మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా యుద్ధం చెయ్యనని ప్రతిన పూని అఖిల్లీస్ తన గుడారంలో కూర్చుంటాడు. దరిదాపు కథాంతం వరకు అఖిల్లీస్ అలక లోనే ఉంటాడు. చిట్ట చివరికి తన ఆప్త మిత్రుడు పాట్రోక్లస్ యుద్ధంలో మరణించేసరికి కోపోద్రేకాలు పెల్లుబకగా దుమారంలా యుద్ధరంగం లోకి


HELEN

దూకి పాట్రోక్లస్ మరణానికి కారణభూతుడైన హెక్టర్ ని హతమార్చి అతని మృత దేహాన్ని ఛిన్నాభిన్నం చేస్తాడు.

కొడుకు మృతదేహాన్ని తెచ్చుకుందుకని హెక్టర్ తండ్రి ప్రియం అర్ధరాత్రి వేళ అఖిల్లీస్ ఆవాసానికి వెళ్లడంతో కథ పూర్తి అవుతుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బహుళ ప్రచారం పొందిన కొయ్యగుర్రం ప్రస్తావన ఇలియాడ్ లో కనిపించదు.

ఇదీ టూకీగా ఇలియాడ్ లో కథ. ఇదంతా ఒలింపియను దేవుళ్ళ కనుసన్నలలో జరుగుతుంది. అనగా ఈ దేవుళ్ళు కేవలం ప్రేక్షకులు కాదు వీరు కూడా ఇరు పక్షాలకు వెనక ఉండి పురికొల్పడం, మద్దత్తు ఇవ్వడం వంటి పనులు చేస్తూ ఉంటారు. కనుక ట్రోయ్ యుద్ధం కేవలం రెండు మానవ సైన్యాలకి పరిమితమైన యుద్ధం కాదు; దేవుళ్ళ మధ్య జరిగిన యుద్ధం కూడా! హేరా (దేవతల అధినేత అయిన జూస్ పట్టమహిషి), ఎతీనా (బుద్ధులకీ, యుద్ధాలకి అధినేత్రి, పొసయిడన్ (సము-

ద్రాలకి అధిపతి) గ్రీకుల పక్షం అయితే ట్రోయ్ పక్షం కాసినవారి-లో అపాలో ముఖ్యుడు.


హృదయ విదారకమైన అంశం ఏమిటంటే యుద్ధంలో మరణం తథ్యం. యుద్ధంలో పాల్గొనే వారు, తద్వారా మరణించే వారిలో యువత ఎక్కువ. అఖిల్లీస్ వయ-స్సులో పిన్నవాడు. ఉడుకు రక్తం వాడు. తల్లి ద్వారా సంక్రమించిన దైవాంశ దన్ను ఉన్నా యుద్ధంలో మరణాన్ని జయించలేక పోయాడు. శౌర్య పరాక్రమాలతో అల్ప కాలం బతికిన తరువాత వీరస్వర్గం కావాలా లేక సాధార-ణమైన జీవితంతో పూర్ణాయు-ర్దాయం కావాలా అని అడిగితే యుద్ధంలో మరణాన్ని ఎదుర్కొని వీరస్వర్గాన్నే కోరుకున్నాడు. అఖి-ల్లీస్ చేతులలో చచ్చిపోయిన హెక్టర్ కూడా యువకుడే!

మరి దేవుళ్ళ సంగతి? వారు అమరులు. వారికీ మరణం లేదు. వారు వారి ఇష్టం వచ్చిన ఆటలు ఆడవచ్చు. మరణం లేకపోయి-నా దేవతలు కూడా కొన్ని కష్టాల-ని ఎదుర్కోక తప్పలేదు. అఖిల్లీస్ మరణంతో అమరత్వం పొందినా అతని తల్లి థేటిస్ గర్భశోకంతో బాధపడుతూనే ఉంది - నేటికీ!

యుద్ధం మొదలయి తొమ్మిదేళ్లు




గడచిన తరువాత గ్రీకు సైన్యం ట్రోయ్ మిత్రరాజ్యం అయిన క్రిసి ని ముట్టడించి లొంగదీసుకుం-టుంది. ఈ సందర్భంలో ఓడిపో-యిన రాజ్యానికి చెందిన ఇద్దరు




కన్యలు - క్రిసేయిస్ (Chryseis), బ్రిసేయిస్ (Briseis) - గ్రీకుల వశం అవుతారు. గ్రీకుల సేనా-ధిపతి అగమేమ్నాన్ క్రిసేయిస్ ని తనకి దక్కిన బహుమానంగా తీసుకుంటాడు. అఖిల్లీస్ బ్రిసే-యిస్ ని తీసుకుంటాడు.

క్రిసేయిస్ తండ్రి క్రిసెస్ - సా-క్షాత్తు ఒలింపాయన దేవుడైన అపా లోకి హితుడు - కూతురు బంధ విమోచనకి అగమేమ్నా-న్ కి ఎంతో విలువైన నగలు, ఆభరణాలు పణంగా పెడతాడు కానీ అగమేమ్నాన్ లొంగడు. తన హితునికి ఎదురవుతున్న పరాజయం చూడగానే అపాలోకి కోపం వచ్చి అగమేమ్నాన్ సేనల మీద ప్లేగు మహమ్మారి పడాలని శపిస్తాడు.

తమ సేనలు ఎండలలో పిట్టల-లా రాలిపోతూ ఉంటే చూసి, కంగారుపడి, అఖిల్లీస్ దైవజ్ఞు-లని సంప్రదించగా, కాల్చస్ (Calchas) అనే దైవజ్ఞుడు లేచి, "ఇదంతా అపాలో శాపం వల్ల జరుగుతోంది" అని చెబుతాడు. అప్పుడు అగమేమ్నాన్ - అయి-ష్టంగానే - క్రిసేయిస్ ని వదలు-కుందుకి ఆమోదిస్తాడు; కానీ ఒక మెలిక పెడతాడు. ఏమిటా మెలిక? తాను క్రిసేయిస్ ని వదులుకుంటే ఆ స్థానంలో అఖిల్లీస్ తనకి బ్రిసేయిస్ ని ఇచ్చెయ్యాలి! ఈ వంకాయల

బేరం విని అఖిల్లీస్ కోపోద్రేకుడయి, కత్తి దూసి, అగమేమ్నాన్ తో ద్వంద్వ యుద్ధానికి తయారవుతాడు. ఒక పక్క ట్రోయ్ సేనలు భీకర పోరాటంలో ఉండగా ఈ గిల్లికజ్జాలు ఏమిటని కాబోలు ఒలింపాయని దేవత హేరా ఈ యోధుల మధ్య సంధి కుదర్చమని ఎథీనాని పంపుతుంది. నెస్టర్ సహాయంతో ఎథీనా చేసిన హితోపదేశం అఖిల్లీస్ కోపాన్ని చల్లార్చుతుంది. తనకి జరిగిన పరాభవానికి ప్రతీకారంగా తాను ఇటుపైన యుద్ధం చెయ్యనని ప్రతిన పూని తన గుడారానికి చేరుకుంటాడు. అఖిల్లీస్ తన కోపం చల్లారక ముందే తన తల్లి అయిన ఎలనాగ (సముద్రపు "జలకన్య") థేటిస్ ని పిలచి తనకి జరిగిన పరాభవానికి ప్రతీకారం చెయ్యడానికి దేవతల రాజైన జూస్ నుండి సహాయం అర్థించమని అడుగుతాడు.

ఇది ఇలా ఉండగా అగమేమ్నాన్ క్రిసేయిస్ ని ఆమె తండ్రి దగ్గరకు పంపేసి, బ్రిసేయిస్ ని తన దగ్గరకి రప్పించుకుంటాడు. ఒడీసియస్ తన పడవలో క్రిసేయిస్ ని తీసుకువెళ్ళి ఆమె తండ్రికి అప్పగించగా, అతను సంతృప్తి చెందిన వాడై గ్రీకు సైనికులని శాపం నుండి విముక్తి చెయ్యమని అపాలోని కోరుకుంటాడు. గ్రీసు కీ ట్రోయ్ కి మధ్య తాత్కాలికంగా యుద్ధ విరమణకి ఒప్పందం జరుగుతుంది.

గ్రీకు సేనలకి, ట్రోయ్ సేనలకి మధ్య యుద్ధం ఆగింది కానీ అఖిల్లీస్ కి అగమేమ్నాన్ కీ మధ్య విరోధ జ్వాలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. దేవతల రాజైన జూస్ ని కలుసుకోడానికి థేటిస్ కి పన్నెండు రోజులు పట్టింది. జూస్ ట్రోయ్ పక్షం కాస్తే భార్య హేరాకి కోపం వస్తుంది; ఆమె గ్రీకుల పక్షం! కాని థేటిస్ కోరికని కాదనలేకపోయాడు, జూస్. హేరాకి కోపం రానే వచ్చింది. మానవుల మధ్య జరుగుతూన్న ఈ పోరాటంలో దేవతలు తల దూర్చడం శ్రేయస్కరం కాదని ఆమె కొడుకు హెఫయెస్టస్ హేరాకి హితోపదేశం చేస్తాడు.

ఈలోగా ట్రోయ్ పక్షం వారు యుద్ధ విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారు. అప్పుడు జూస్ ట్రోయ్ పక్షం వహించి వారికీ సహాయం చెయ్యడానికి వస్తాడు. జూస్ ట్రోయ్ పక్షం కాయడం, అఖిల్లీస్ అస్త్ర సన్యాసం చేసి ఇహ పోరాడనని భీష్మించుకుని కుర్చోవడం వల్ల గ్రీకు సేనలు బాగా నష్టపోతారు. చాల రోజులు జరిగిన ఆ భీకర పోరాటంలో పేరిస్-మెనలావుస్ ల మధ్య, హెక్టర్-ఏజాక్స్ ల మధ్య జరిగిన ద్వంద్వ యుద్ధాలు చిరస్మరణీయమైనవి. అయినా సరే ట్రోయ్ సైన్యాలు గ్రీకు సేనా వాహినిని తరిమి కొట్టాయి.

భారత యుద్ధంలో వ్యాసుడు పద్దెనిమిది రోజుల యుద్ధాన్ని, దినాలవారీగా, వ్యూహాలవారీగా, అస్త్రాలవారీగా ఎలా వర్ణిస్తాడో హోమర్ కూడా అలా ఆ యుద్ధాన్ని వర్ణించుకుంటూ వస్తాడు. చిట్టచివరికి ట్రోయ్ నగరాన్ని పడగొట్టలేక గ్రీసు సేనలు పడవలలో ఎక్కి పారిపోతారు. ఆ హడావిడిలో ఒక కొయ్య గుర్రాన్ని సముద్రపుటొడ్డున వదిలేసి మరీ పోతారు. ట్రోయ్ సేనలు వారి విజయానికి ఆ గుర్రం ఒక అభిజ్ఞానం అనుకుంటూ దానిని ఈడుచుకుని పట్టణపు లోపలికి తీసుకుపోతారు. లోపలికి వెళ్లిన తరువాత ఆ కొయ్యగుర్రం తలుపులు తెరుచుకుని గ్రీకు సేనా వాహిని, యులిసిస్ నాయకత్వంలో, బయటకి వచ్చి ట్రోయ్ నగరాన్ని పరిపూర్ణంగా కొల్లగొట్టి పోతారు.

భారత యుద్ధం ధర్మయుద్ధానికి ప్రతీక అయితే ట్రోయ్ యుద్ధం దేవతల అగ్రహానికి, స్వల్పబుద్ధికి ప్రతీక అనుకోవచ్చు.

(32 వ పేజీ చూడండి )

# ప్రేమంటే ఇంతే

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



(గతసంచికతరువాయి)

"వెరీగుడ్, అటువంటి మంచి మనసున్న వ్యక్తి దగ్గర ఉద్యోగం దొరకడం చాలా సంతోషంగా వుంది"

"నీ ఉద్యోగం ఎలా వుంది? ఎన్ని ప్రమోషన్స్ వచ్చాయి? ఏమైనా అవార్డ్స్ వచ్చాయా?"

"నా ఉద్యోగం ఇప్పటికి మూడు పురస్కారాలు, ఆరు బదిలీలు, నాలుగు పదోన్నతులతో విలసిల్లింది"

"గ్రేట్ మూడు పురస్కారాలు వచ్చాయా, కంగ్రాట్స్"

ఇంతలో ఫుడ్ వచ్చింది. వైటర్‌ని సర్వ్ చేయవద్దని చెప్పాడు కృష్ణమోహన్. రాధ సర్వ్ చేయబోతే కృష్ణమోహన్ ఆపి "నేను సర్వ్ చేస్తాను, ఇలాంటి అవకాశం మళ్ళీ రావచ్చు, రాక పోవచ్చు,ఇది నా భాగ్యం" అన్నాడు.

"బావా నాలో ఏమైనా మార్పు వచ్చిందా?"

"ఏమీలేదు అప్పటి జయచిత్ర లాగ అప్పుడున్నావు ఇప్పటి జయచిత్ర లాగ ఇప్పుడున్నావు" అని ఏడిపించాడు

"ఇది టూ మచ్, నేను అంత భారీగా వున్నానా" అంటూ గారంగా బుంగమూతి పెట్టింది.

"అంత లేవు, కానీ ఇదివరకు కన్నా బాగా బొద్దుగా వున్నావు"

"ఆడవాళ్ళకి పెళ్ళిళ్ళు అయినాకా బాగా మార్పు వస్తుంది నాయనా"

"అవును, అయినా ఆడవాళ్ళు బొద్దుగా వుంటేనే అందంగా వుంటారు"

"తా వలచింది రంభ అన్నారు"

వాళ్ళ భోజనాలు పూర్తి అయ్యాక లస్సీ త్రాగి పది నిముషాలు రిలాక్స్ అయి మళ్ళీ బయలుదేరారు. కారు దగ్గరకి వచ్చాక "ఇప్పుడు నేను కారు డ్రైవ్ చేస్తాను, నువ్వు కాస్సేపు రిలాక్స్ అవు" అంది అనూరాధ.

"నిజంగా! డ్రైవింగ్ ఎప్పుడు నేర్చుకున్నావు? "

కారు స్టార్ట్ చేసి డ్రైవ్ చేస్తూ "పది సంవత్సరాలు దాటింది డ్రైవింగ్ నేర్చుకుని, కృష్ణా చాలా రోజులయింది నీ పాట విని ఒక పాట పాడవా?" అని అడిగింది అనూరాధ.

"OK పాడతాను, ఏ పాట కావాలి"

"మూగమనసులులో పాట పాడుతా తీయగా చల్లగా"

"ఆ పాట బీచ్‌కి వెళ్ళిన తరువాత పాడుతాను ఎందుకంటే ఇపుడు స్టీరింగ్ నీ చేతిలో వుంది కదా ఆ పాట వింటూ నువ్వు నిద్రపోతే ప్రమాదం" అన్నాడు కృష్ణమోహన్ నవ్వుతూ.

"సరే నీకు నచ్చిన పాట పాడు" అంది రాధ.

"ఔరా అమ్మకచెల్లా ఆలకించి నమ్మడమెల్లా", "ఫూలోన్ కె రంగ్ సే దిల్ కీ కలమ్ సే" చక్కగా పాడి వినిపించాడు కృష్ణమోహన్.

పూడిమడక బీచ్‌కి చేరేసరికి మధ్యాహ్నం మూడున్నర అయింది.

శీతాకాలం అవటం వలన ఎండ తీవ్రత ఎక్కువ లేకపోయినా ఒక గంట కారులోనే కూర్చుని కబుర్లు చెప్పుకుందామని అనూరాధ కోరడంతో కారులో కూర్చుని కబుర్లు మొదలెట్టారు.

"నేను హైదరాబాద్ వదిలేసాక ఇదే కలవడం, ఇప్పుడు చెప్పు నీ సంగతులు" అన్నాడు కృష్ణమోహన్.

"చెబుతాను, ముందు ఈ 23 ఏళ్ళలో నన్ను చూడటానికి ఎందుకు రాలేదో చెప్పు"

"ఏం చెప్పమంటావు, నేను ఏం చెప్పినా అది కుంటిసాకు అవుతుంది. హైదరాబాద్ నుండి ఈ వూరు వచ్చాక నేను జరిగినదాని నుండి కోలుకోవడానికి కొంత సమయం పట్టింది, తరువాత రుక్మిణితో వివాహం జరిగింది. ఆ తరువాత నాకు పదోన్నతి మీద ఢిల్లీ బదిలీ అయింది అక్కడనుండి మద్రాసు, బెంగుళూరు, కలకత్తా, తిరిగి వైజాగ్ ఇప్పుడు బాంబే వెళ్ళాలి. ఈ చక్రభ్రమణం వల్లా, ఉద్యోగరీత్యా చాలా బిజీ అవడం వల్లా నేను గతాన్ని దాదాపు మరచిపోయాను...నేను

మద్రాస్‌లో వుండగా ప్రకాష్ చని-పోయాడని పిడుగులాంటి వార్త విన్నాను...నాకు దాదాపు మూడు నెలల తరువాత వైదేహి అక్కయ్య వాళ్ళు తిరుపతి వచ్చి అక్కడనుం-డి మద్రాస్ వచ్చినపుడు తెలిసింది. ఆ వార్త విన్న వెంటనే కాళ్ళ క్రింద నేల ఖాళీ అయి అగాధంలో-కి పడిపోయినట్లయింది. రెండు రోజులు రోదిస్తూనే వున్నాను. నా పరిస్థితి చూసి 'అందుకే నీకిం-తవరకూ చెప్పలేదురా' అంది అక్కయ్య. వంశీ అప్పటికి మూడే-ళ్ళవాడు, సుప్రియ ఏడాది పిల్ల... నా పరిస్థితి చూసాక చిన్నపిల్లల-తో రుక్మిణి ఇబ్బంది పడుతుం-దని అక్కయ్యని వారం రోజులు వుంచేసారు బావగారు. మూడు రోజుల తరువాత కాస్త కోలుకుని ఆఫీస్‌కి వెళ్ళాను...అటువంటి సమయంలో రుక్మిణి ఒక పసిపా-పని చూసుకున్నట్లు చూసుకుని నన్ను ఓదార్చింది, పూర్తిగా కోలు-కోవడానికి పది రోజులు పట్టింది... నా పరిస్థితి చూసి "ఒకసారి అనూ-రాధని చూసి వద్దామండి, ఆవిడని చూస్తే మీలో గూడుగట్టుకున్న ఈ దుఃఖానికి ఉపశమనం లభిస్తుం-ది" అంది రుక్మిణి.

"వాళ్ళకి చాదస్తాలు ఎక్కువ అం-దువల్ల రాధ నుదిటిమీద బొట్టు తీసేస్తారెమో, రాధ నుదిటిమీద బొట్టులేకుండా నేను చూడలేను, చూసి భరించలేను" అని రుక్మి-ణితో చెప్పాను...ఒకవేళ ఈయన ఊహించినట్లే జరిగితే ఈయనని కంట్రోల్ చేయలేము అని ఆ ఆలోచన విరమించుకుంది రుక్మిణి.

అందుకనే మొన్న నిన్ను మొద-టిసారి చూసినపుడు ముందు నీ నుదిటి మీద బొట్టు వుందా లేదా అని చూసాను. బొట్టు కనబడినాక "హమ్మయ్య" అనుకున్నాను...నీకు కష్టం వచ్చినపుడు నేను మౌనంగా వుండిపోయి తప్పు చేసాననే చింత, నీకు కనీసం ఒక ఓదార్పు మాట కూడా చెప్పలేదనే వేదన, ఈ పదహారు సంవత్సరాలుగా నాలో నేను పడుతున్న ఈ సం-ఘర్షణల ఫలితమే మొన్న నిన్ను చూడగానే ఒక్కసారి దుఃఖము పెల్లుబికి ఆ రోజు నేను స్థిమితం-గా వుండలేకపోయాను"...అంటూ కన్నీరు కారుస్తూ తన మనసులో ఆవేదనని చెప్పాడు కృష్ణమోహన్. ప్రకాష్ విషయం వచ్చేసరి-కి అనూరాధకి కూడా దుఃఖం వచ్చి కన్నీళ్ళు తన్నుకు వచ్చి వెక్కి వెక్కి ఏడవసాగింది. "సారీ రాధా, ప్రకాష్ గుర్తుకొచ్చాడా? అనవస-రంగా నిన్ను కలవరపెట్టాను. కాస్త మంచి నీళ్ళు త్రాగు సర్దుకుంటుం-ది" అంటూ ఓదార్చి మంచినీళ్ళు త్రాగించాడు కృష్ణమోహన్.

"అవును గుర్తుకొచ్చారు. ఆయన పోయిన తరువాత నన్ను ఎంతోమంది చాలా రకాలుగా ఓదార్చారు, కానీ ఎవరు ఎన్ని రకాలుగా ఓదార్చినా నేను నీ దగ్గ-రనుండి ఈ ఓదార్పుని కోరుకు-న్నాను...ఇకపోతే ఈ బొట్టు వి-షయానికి వస్తే నీకు గుర్తుందా? ఒకసారి హైదరాబాదులో నువ్వు మా ఇంటికి వచ్చినపుడు మా వెనక వీధిలో మా దూరపు బంధువు ఒక నడి వయస్కురాలి భర్త చనిపోతే, ఆ రోజు వాళ్ళింట్లో ఆ రకమైన కా-ర్యక్రమం వాళ్ళు నిర్వర్తించబోతూ వుంటే నువ్వు వెళ్ళి వాళ్ళ పెద్దవా-ళ్ళతో మాట్లాడి ఆ కార్యక్రమాన్ని ఆపించావు...

...ఆ రోజు "ఆడదానికి బొట్టు, కాటుక, పువ్వులు, గాజులు పెళ్ళి జరగక ముందునుంచి వున్నాయి, భర్తతో పాటు అవి రాలేదు, అందుకని అతను చనిపోయాక వాటిని స్త్రీ ఎందుకు విసర్జించాలి? ఆ పసిపిల్లలు రోజూ వాళ్ళ అమ్మని చూసి ఈ విషాదాన్ని తలచుకొని బాధ పడరా? పోయిన కన్నతండ్రి-ని ఎలాగో మనమెవ్వరమూ తిరిగి ఇవ్వలేము, కనీసం ఆ తల్లి పచ్చగా కనబడితే ఆ చిన్ని హృదయాలు కాస్త ఊరట చెందుతాయి"....అవి నువ్వన్న మాటలు నా మస్తిష్కం-లో నిలిచిపోయాయి, అందుకే వాటిని వదిలివేయడానికి నేనూ ఒప్పుకోలేదు...

...దాని గురించి ఇంట్లో చాలా పంచాయతి జరిగింది. "నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారు, మా పరువు నలు-గురిలో తీసేస్తావు, ఆ మోహన్ మాటలు నీ బుర్రలో బాగా నాటు-కుపోయాయి, అందుకే నువ్విలా మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావు" అంటూ అమ్మా, నాన్నగారూ చాలా గొడవ చేసారు, అయితే అన్న-య్యలూ, వదినలూ నన్ను పూర్తిగా సమర్ధించారు...నన్ను తప్పుగా అర్ధం చేసుకోకు బావా, నువ్వు ఎందుకు రాలేదో తెలుసుకోవా-లని కుతూహలంతో అడిగాను

గాని, వివరణ కోసం కాదు" అంది అనూరాధ.
"నువ్వు కుతూహలంతో అడిగినా, వివరణ ఇవ్వవలసిన బాధ్యత నాకుంది రాధా"
"సరేగాని మొన్న నేను వచ్చిన రోజు నన్ను చూసి నువ్వు చాలా కలత చెందినట్లు నాకు అర్థం అయింది, సాయంత్రం నువ్వు ఎక్కడికో వెళ్ళావు, రుక్మిణి చాలా టెన్సగా కనబడింది, కానీ అడగటం సంస్కారం కాదని అడగలేదు. రాత్రి ఫోన్ వచ్చిన తరువాత రుక్మిణి, మురళి హడావిడిగా బయలుదేరి వెళ్ళారు, అసలేం జరిగింది ఆ రోజు"
ఆ రోజు సాయంత్రం అవినాష్ ఇంటికి డ్రింక్ చెయడానికి వెళ్ళడం, అక్కడ జరిగిన విషయాలు అన్నీ పూస గుచ్చినట్లు రాధకి వివరించాడు.
"అయితే నువ్వింకా డ్రింక్ చేస్తున్నావా?" అని అనుమానంగా అడిగింది అనూరాధ.
"లేదు రాధా, 23 సంవత్సరాల క్రిందట నీకు మాట ఇచ్చిన తరువాత నేను తాగ లేదు. కానీ ఆ రోజు నిన్ను చూసిన తరువాత నాకు కలిగిన ఆవేదనని తట్టుకోలేక, నన్ను నేను నియంత్రించుకో లేక తాగి ఆ బాధని మరచిపోదాము అనుకుని నిగ్రహం కోల్పోయాను. కాకపోతే అవినాశ్ తెలివిగా నేను తాగకుండా, నేను నీకిచ్చిన మాట తప్పకుండా నన్ను కాపాడాడు. అదే ఆ రోజు తాగి వుంటే నేను చేసిన పనికి జీవితాంతం నీకు మొహం చూపించలేక పొయేవాడిని" అన్నాడు కృష్ణమోహన్.
"'ఒకొక్క సారి మన ఆవేదన మనలోని నిగ్రహన్ని చంపేస్తుంది'. సో నాకిచ్చిన వాగ్దానాన్ని మళ్ళీ గుర్తుచేస్తున్నాను, నా చేతిలో చెయ్యి వేసి ఆ మాటని పునరుద్ధరించు బావా" అంది అనూరాధ.
తన కుడి చేతిని అనూరాధ కుడి చేతిలో వుంచి "ప్రామిస్, నీకిచ్చిన మాట తప్పకుండా నిలబెట్టుకుంటాను" అన్నాడు కృష్ణమోహన్.
"నా బావ మంచివాడు నేను చెప్పినట్లు వింటాడు...బావా మన వయసు ఏభైకి దగ్గర పడుతున్నాది, నీ ఆరోగ్యం జాగ్రత్త, అందుకోసమే నా ఆరాటం, నీకేమైనా అయితే నేను తట్టుకోలేను" తన ఆందోళనని వ్యక్తం చేస్తూ అంది రాధ.
"అలాగే కంగారుపడకు. నీ ఆరోగ్యం జాగ్రత్త, పిల్లలు జాగ్రత్త. అనవసరమైన ఆలోచనలు చేస్తూ కృంగిపోకు, వారానికి ఒకసారయినా ఫోన్ చేస్తూ వుండు. ఎప్పుడు నీకు ఏ రకమైన అవసరం వచ్చినా, సహాయం అవసరమైనా నేనున్నాని గుర్తుంచుకో, మొహమాట పడకుండా చెప్పు, నాకు కుదరక పోయినా రుక్మిణిని పంపుతాను...ఒక విషయం గుర్తుపెట్టుకో నేను ఉద్యోగరీత్యా చాలా బిజీగా వుంటాను. సమావేశాలు, సదస్సులు, గోష్టులు, టూర్స్ చాలా ఎక్కువ. నెలకి కనీసం 15 నుండి 18 రోజులు వీటితోనే సరిపోతుంది, అందులో బాంబేలో ఇవి ఇంకా ఎక్కువ. అవసరం బట్టి విదేశాలకి కూడా వెళ్ళవలసి వుంటుంది. అందుకని నేను ఏదైనా బిజీలో వుండి ఫోన్ లిఫ్ట్ చెయ్యకపోతే కంగారుపడకు. ఇంటికి ఫోన్ చేసి రుక్మిణితో మాట్లాడు" అన్నాడు కృష్ణమోహన్.
"అలాగే, ఇప్పటిదాకా ఎన్ని దేశాలు చూశావు? రుక్మిణిని కూడా తీసుకెళ్ళావా?"
"ఒకసారి జినీవా వెళ్ళాను, అప్పుడు సుప్రియ వయసు రెండో నెల అందుకని రుక్మిణి రాలేకపోయింది. రెండు రోజులూ గోష్టిలతో బిజీగా వున్నాను, మూడో రోజు సిటీ చూడడానికి మా వాళ్ళంతా వెళ్ళినా, రుక్మిణి లేకుండా నాకు వెళ్ళాలనిపించలేదు, అందుకని రూంలోనే వుండిపోయాను. ఉంకో సారి జర్మనీ, ఇంగ్లాండ్ వెళ్ళినపుడు రుక్మిణిని కూడా తీసుకు వెళ్ళాను"
"అబ్బో, అబ్బాయిగారికి పెళ్ళాం మీద చాలా ప్రేమ వుందే" అని సరదాగా వేళాకోళం చేసింది అనూరాధ.
"నన్ను నమ్ముకుని నా వెంట నడచి వచ్చిన వ్యక్తి మీద ప్రేమ వుండదా రాధా?"
"మరి నా మీద" ఇంకా ఆట పట్టిస్తూ అడిగింది అనూరాధ.
"మీరిద్దరూ నా రెండు కళ్ళు, ఇంకెప్పుడూ అలా అడగకు"
"సరదాగా నిన్ను ఆట పట్టిద్దామని అలా అన్నాను"
"రాక్షసి నాకంటే అమాయకుడు దొరకలేదా?"

************

సరే పాడుతా తీయగా చల్లగా... పాట ఇప్పుడు పాడు" అంది అనూరాధ. కృష్ణమోహన్ పాడాడు

ఆ పాటతో ఇద్దరి హృదయాలూ బరువెక్కాయి.

“అది సరేగాని కోనసీమ అమ్మాయిని పెళ్ళి చేసుకుందామని అనుకున్నావు, నన్ను చేసుకోలేకపోయినా ఉంకో కోనసీమ అమ్మాయినే చేసుకున్నావు...నీకు తెలుసా? మా అమ్మగారు, మీ అత్తగారు జ్ఞాతులు, కానీ రెండు తరాల ముందు వారి కుటుంబాల మధ్య కలతలు వచ్చి రాకపోకలు లేవు.అసలు రుక్మిణి సంబంధము గురించి ఎవరు చెప్పారు? ఆ కథ మొత్తం చెప్పు వినాలని కుతూహలంగా వుంది" అంది అనూరాధ.

"మీరు బంధువులని నాకు తెలుసు, బావగారి తల్లికి కూడ అదే చుట్టరికం వుంది కదా”. నీ వివాహం తరువాత నేను హైదరాబాద్‌లో వుండలేకపోయాను, ఆ వూర్లో వుంటే నువ్వే జ్ఞాపకం వచ్చి నీ గురించే ఆలోచిస్తూ నా బ్రతుకుతో పాటు నీ బ్రతుకు కూడా ఎక్కడ దుర్భరం చేస్తానోనని గుబులు పుట్టింది. ఆ సమయంలో అవినాశ్ నా వెన్నంటి నిలిచి నన్ను కంటికి రెప్పలా చూసుకున్నాడు”. అతను ఇచ్చిన సలహా మేరకు నేను మా డైరెక్టర్ మిశ్రాగారిని కలిసి మొత్తం నా బాధని వివరించి "నన్ను విశాఖపట్నం బదిలీ చెయ్యండి, ఒక వేళ అవకాశం లేకపోతే నేను ఉంకో వుద్యోగం చూసుకుని వెళతాను, ఈ వూర్లో నేను వుండలేను" అని విన్నవించుకున్నాను.

ఆయన నన్ను సహృదయంతో అర్థం చేసుకుని "మిస్టర్ మోహన్! నేను కూడా ఈ యాతన అనుభవించిన వాడిని గనుక మీ బాధను అర్థం చేసుకున్నాను. తప్పకుండా డి.జి. సాబ్‌తో మాట్లాడి మీకు విశాఖపట్నం బదిలీ అయేటట్లు చూస్తాను, మీరు నిశ్చింతగా వుండండి" అన్నారు.

కొన్ని నెలల తరువాత నాకు విశాఖపట్నం బదిలీ అయ్యింది. విశాఖపట్నం వచ్చాక చాలా రోజులు ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడిని కాదు, ఒంటరిగా గడపడానికి ఇష్టపడేవాడిని, ఒక నిర్వేదంలో, ఒక నిర్లిప్త వైఖరితో నిరుత్సాహంగా వుండేవాడిని. మొదట్లో మా అమ్మ నాన్నగారు, సన్నిహిత మిత్రులు "సరేలే జరిగినదానికి వాడు అలా కలతగా వున్నాడు, అనూని మరచిపోలేక పోతున్నాడు, కొన్నాళ్ళు వాడిని మనము మన ప్రశ్నలతో, సలహాలతో ఇబ్బంది పెట్టవద్దు" అని అనుకున్నారు. కానీ ఆరు నెలల తరువాత కూడా నాలో మార్పు రాకపోతే "వీడేమైపోతాడో" అని అమ్మ కంగారు పడి నాన్నగారితో చెప్పి బాధ పడింది.

ఒక ఆదివారం నాన్నగారు నన్ను బీచ్‌కి తీసుకుని వెళ్ళి అక్కడ నాతో మాట్లాడారు. మా నాన్నగారు నాకు చిన్నప్పటినుండి అన్ని విషయాలలోను సలహాలు, సూచనలు ఇచ్చి మార్గదర్శకుడుగా వుండేవారు, ఆయన నన్ను ఎప్పుడూ ఒక స్నేహితుడిగా భావించేవారు. అందుకే ఆయన "ఒరేయ్ మోహన్ ఏమిటిరా ఇది? ఎంతో హుషారుగా వుండి అందరితో కలివిడిగా వుండేవాడివి, అనూని మర్చిపోలేక పోతున్నావా?' అని అడిగేసరికి నాకు దఃఖం ఆగలేదు.

"బాధ పడకు, మనిషి అనుకున్నది జరగనపుడు, ఓటమిని ఎదుర్కొన్నపుడు కృంగిపోవడం సహజం. ఆ బాధని, ఆవేదనని ఉంకొకరితో పంచుకుని ఇలా కన్నీళ్ళ ద్వారా బయటికి పంపివేస్తే హృదయం తేలిక పడుతుంది, మనసుకి ప్రశాంతత చేకూరుతుంది. అంతేగాని బాధని నీలోనే దాచుకొని కుమిలిపోతే సమస్య పరిష్కారం కాదు...

. . . ప్రేమించిన వాళ్ళు వదిలి వెళ్ళి పోయారని...అలాగే ఉండిపోతే ఎలా? దేహానికి తప్ప, దాహానికి పనికిరాని ఆ సముద్రపు కెరటాలే ఎగిసి ఎగిసి పడుతుంటే”... ఇవి నా మాటలు కావు, నువ్వు ఇష్టపడే శ్రీశ్రీ గారు అన్న మాటలు...

...ఒరేయ్ ఆ సముద్ర తరంగాలని చూడు, అవి లేస్తున్నాయి, పడుతున్నాయి, మళ్ళీ లేస్తున్నాయి. మనిషి జీవితం కూడా ఆ తరంగం లాంటిది, ఆ తరంగం ఒకొక్క సారి ఎగిసిపడుతుంది, అది తన విజయాలకి సంకేతం. అలా ఎగిసిపడిన తరంగం మళ్ళీ క్రిందపడుతుంది, అది తన అపజయాలకి సంకేతం. అలా క్రింద పడిన తరంగం తన శక్తినంతా కూడగట్టుకొని మళ్ళీ ఉవ్వెత్తున లేస్తుంది, అది దాని పట్టుదలకి, పోరాటపటిమకి సంకేతం. మనిషి కూడా అలాగే జీవితంలో ఎన్నో పోరాటాలు చెయ్యాలి అంతేగాని

ఒక సమస్య వస్తే అక్కడితో "ఇదంతా నా దురదృష్టం" అని నిరాశ పడకూడదు, నిరుత్సాహ పడకూడదు...

...మనము అనుకున్నది సాధించలేనపుడు, ఓటమిని చవిచూసినపుడు మన మనో స్థైర్యాన్ని కోల్పోకూడదు. జరిగినదానికి బాధ పడటం వలన ప్రయోజనము వుండదు, పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొని ఏం చేస్తే పరిస్థితిలో మార్పు వచ్చి మనసుకి ప్రశాంతత కలిగి, నా అపజయం మీద విజయం సాధించాను అనే తృప్తి కలుగుతుంది అని ఆలోచించాలి...

...జరిగినది మరచిపో. మీ అమ్మ నిన్ను చూసి చాలా ఆవేదనకి గురి అవుతున్నాది, బెంగ పడుతున్నాది. ఒక మంచి సంబంధము చూసి నీకు వీలైనంత తొందరగా వివాహం చేద్దామనుకుంటున్నాము. మనిషి జీవితంలో వివాహం చాలా మార్పులు తెస్తుంది, బాధ్యతలని పెంచుతుంది. పెళ్ళి చేసుకుని పిల్లలు పుట్టిన తరువాత జీవితం మొత్తం అన్యముగా వుంటుంది. ఆ చిన్నారుల ఆట పాటలతో జీవితం ఎంతో మధురంగా వుంటుంది' ...

...అందుకని నువ్వు ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఆ దశకి చేరుకుంటే నీ గతం నుండి నీకు ఉపశాంతి లభిస్తుంది. మేమూ మా విశ్రాంత జీవితంలో మనుమల ఆట పాటలతో ముచ్చట్లతో ఆనందంగా, సంతోషంగా జీవిస్తాము" అని నాకు నచ్చచెప్పారు.

ఆయన చెప్పినదంతా విన్నాక "నాన్నగారు మీరు చెప్పిన విషయాలన్నీ విన్నాను. మనిషి తను కోరుకున్నది లేదా ఆశించినది దక్కనపుడు నిరాశ చెందడము సహజము. నేనూ మనిషినే కనుక ప్రస్తుతం ఆ వేదనని అనుభవిస్తున్నాను. మీరు అమ్మ దిగులు పడకండి, నేను తప్పకుండా కోలుకుంటాను. కొన్నాళ్ళపాటు పెళ్ళికి నన్ను తొందరపెట్టొద్దు" అన్నాను.

ఆ తరువాత నాకు బాగా సన్నిహితులైన షాజహాన్, అవినాశ్ లాంటి వాళ్ళ ద్వారా నాకు ఎన్నోసార్లు హితబోధలు చేయించి పెళ్ళికి ఒప్పించారు...

నాతో కాకినాడలో చదువుకున్న నా స్నేహితుడు మహేంద్రవర్మ పెళ్ళికి నేను, అవినాశ్ కాకినాడ వెళ్ళాము. రుక్మిణి కూడా ఆ పెళ్ళికి వచ్చింది. పెళ్ళి అయిన తరువాత మహేంద్రవర్మ పెళ్ళికూతురు శశిరేఖని మా మిత్రులందరకి పరిచయం చేసాడు. అప్పుడు శశిరేఖతో పాటు ఆమె స్నేహితురాళ్ళు ఒక అరడజను మంది వున్నారు, వారందరిని మహేంద్రవర్మతో పాటు మాకు పరిచయం చేసింది శశిరేఖ. అంతా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము, అంతలో మహేంద్రవర్మ నన్ను, అవినాష్‌ని ప్రక్కకి తీసుకువెళ్ళి..."ఒరేయ్ ఆ అమ్మాయి ఎలా వుందిరా!" అని రుక్మిణిని చూపించి అడిగాడు. మామూలుగా అడిగాడు అనుకొని "చాలా బాగుంది" అన్నాను. మళ్ళీ అనుమానం వచ్చి "ఆ అమ్మాయి గురించి నన్ను అలా ఎందుకు అడిగావు?" అని అడిగాను.

"ఆ అమ్మాయి పేరు రుక్మిణి. శశిరేఖ, రుక్మిణి అమలాపురంలో ఇంటర్, డిగ్రీ కలిసి చదువుకున్నారు, చాలా మంచి ఫ్రెండ్స్, రుక్మిణి తండ్రిగారు అమలాపురం కాలేజి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు, వాళ్ళూ బ్రాహ్మణులలో మీ శాఖ వారేనని శశిరేఖ చెప్పింది. మొదటి సారి ఆ అమ్మాయిని మా పెళ్ళి చూపుల సమయంలో చూసిన దగ్గరనుండి నీకు సరైన జోడీ అనిపించింది. మా వివాహం సెటిల్ అయినాక ఒక సారి శశిరేఖకి నా ఆల్బంలో వున్న నీ ఫోటో చూపించి నా ఉద్దేశ్యం చెప్పాను... తను కూడా మీ ఇద్దరి జోడీ చాలా బాగుంటుందని చెప్పి రుక్మిణి తల్లితండ్రులతో విషయం చెప్పి, నువ్వు మా పెళ్ళికి వస్తావని అందుకని రుక్మిణిని మా పెళ్ళికి కాకినాడ పంపమని వారితో చెప్పింది. అయితే ఈ విషయాలు ఏవీ రుక్మిణికి తెలియవు, నీ ప్రతిస్పందన చూసి అప్పుడు ఆ అమ్మాయికి చెబుదామని ఆగాము...ఎందుకంటే ఒకవేళ నువ్వు అనుకూలంగా లేకపోతే రుక్మిణి నిరుత్సాహ పడుతుందికదా, అదీ సంగతి. నువ్వు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, శశిరేఖ రుక్మిణికి విషయం చెప్పి వ్యవహారం నడుపుతుంది. మీరిద్దరూ కాస్సేపు మాట్లాడుకోవడానికి నేను ఏర్పాటు చేస్తాను" అన్నాడు మహేంద్రవర్మ.

ఇదంతా విన్న అవినాశ్ "బావా అమ్మాయి చాలా బాగుంది, నువ్వు కోరుకున్న కోనసీమ అమ్మాయి,

రుక్మిణి నాన్నగారు కాలేజి ప్రిన్సిపాల్‌గా చేస్తున్నారు, మంచి హోదాలో వున్నారు, వాళ్ళూ మీ శాఖ వాళ్ళే కనుక ఇంట్లో కూడా అభ్యంతరం వుండకపోవచ్చు" అన్నాడు.

కాస్సేపు ఆలోచించిన తరువాత "మహేంద్రా ఆ అమ్మాయికి కూడా నేను నచ్చితే, మాట్లాడటానికి అభ్యంతరం లేకపోతే మాట్లాడించు" అన్నాను.

నా మాట విని మహేంద్ర, అవినాశ్ చాలా ఆనందించారు. అవినాశ్ అయితే ఆనందాన్ని పట్టలేక నన్ను కౌగలించుకొని "బావా నా ఆనందాన్ని మాటలలో చెప్పలేను, మళ్ళీ నీ జీవితంలోకి వసంతం రావాలి బావా" అని సంతోషంతో ఉద్వేగానికి గురి అయ్యాడు.


కాస్సేపు పోయినాక మహేంద్రవర్మ నా దగ్గరకు వచ్చి "ఒరేయ్ మోహన్, శశిరేఖ రుక్మిణితో విషయం చెప్పి నీ వివరాలు కూడా చెప్పింది. రుక్మిణి తల్లి తండ్రులకి కూడా నీ గురించి చెప్పినట్లు చెప్పి, నిన్ను క్లోజ్ రేంజ్ నుండి ఉంకొక సారి చూపించింది. ఆ తరువాత స్నేహితురాళ్ళిద్దరూ ఏకాంతంగా మాట్లాడుకున్నారు, ఇప్పుడే శశిరేఖ వచ్చి శుభవార్త చెప్పింది...ఒక పని చెయ్యి నేను కారు ఎరేంజ్ చేస్తాను, నువ్వు, రుక్మిణి వోల్గా రెస్టారెంట్‌కి వెళ్ళి అక్కడ కూర్చుని సావకాశంగా మాట్లాడుకోండి" అన్నాడు.

కాస్సేపు పోయిన తరువాత నేను, రుక్మిణి కారులో బయలుదేరాము. మా ఫ్రెండ్స్, రుక్మిణి ఫ్రెండ్స్, అవినాశ్, పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు అందరూ కారు దగ్గరకి వచ్చి ..."మోహన్, రుక్మిణి మేమంతా శుభవార్త కోసం ఎదురు చూస్తూ వుంటాము, బెస్ట్ ఆఫ్ లక్" అని చెప్పారు.

(ఇంకా వుంది)

## ఇలియాడ్: సంగ్రహంగా

(26 వ పేజీ తరువాయి)




గ్రీకు తత్త్వవేత్త ప్లేటో (సా. శ. పూ. 428 - 348) తనకు సుమారు నాలుగువందల ఏళ్ల పూర్వుడైన హోమర్ రాసిన 'ఇలియాడ్' గురించి చెపుతూ ఇలా పేర్కొన్నాడు: "దాదాపు ప్రతిరోజూ ఏథెన్స్ నగరంలోని మార్కెట్ స్థలంలోనో, నాటక మందిరంలోనో, లేక కొండ పక్కనున్న విశాలమైన ఆరుబయలు మైదానంలోనో ఇరవైవేలకు పైగానే జనం పోగై, ఎవరో ఒక ప్రముఖ గాయకుడు 'ఇలియాడ్' లోని 'హెక్టర్ మృతి', 'ప్రియాం రాజు - అఖిల్లీస్ ల భేటీ ' మొదలగు రసవద్ఘట్టాలను శ్రావ్యంగా గానం చేస్తుంటే శ్రద్ధగా ఆలకిస్తూ ఉంటారు."

విశ్వ విజేత అలెగ్జాండర్ (సా. శ. పూ. 356 - 322) ' ఇలియాడ్' గ్రంథాన్ని తన తలగడ కింద ఉంచుకుని, చదవాలని బుద్ధిపుట్టినప్పుడల్లా తీసి చదువుకునేవాడనీ, కుదిరినప్పుడల్లా 'ఇలియాడ్' లోని ఘట్టాలు కథాంశాలుగా జరిగే నాటక ప్రదర్శనలు తిలకించేవాడనీ చరిత్రకారులు పేర్కొన్నారు.

(ఇంకా వుంది)

# మన చరిత్ర ` నేటి యువతరానికి స్ఫూర్తి ప్రదాత జలియన్‌వాలా బాగ్ దురంతం




## 13 ఏప్రిల్ 1919

మత్స్యరాజ హరగోపాల్

అమృతసర్ ` స్వర్ణదేవాలయ సమీపంలో జలియన్‌వాలాబాగ్. అది 1919వ సంవత్సరం. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసేసరికి దేశమంతా ఉద్రిక్త పరిస్థితుల్లో ఉన్న సమయ-మది. ఆ యుద్ధంలో పాల్గొన్న మన భారతీయ సైనికు ఎడ బ్రిటిష్‌వారి నిరాదరణవ్ల, భారతీయులంతా తెల్లదొ-రపై కక్ష సాధించడానికి సన్నద్ధమై, సన్నాహాు చేస్తున్న సమయమది.

1918`19 సంవత్సర కాంలో మన దేశం రాజకీయ ఆర్థిక సంక్షోభంలో ఉంది. అనావృష్టివ్ల కరువు కాం. వీటికి తోడు ప్రజపై అనాటి తెల్లదొర దమ-నకాండ, వారి పానా విధానాు అగ్నికి ఆజ్యం పోశాయి. ఇలాంటి సంక్షోభ సమయంలోనే వచ్చి నిరంకుశవాది. భారతీయ ప్రజ ఎడ ద్వేషభావం కల్గిన క్రూర మైకెల్ ఓ డయ్యర్ పంజాబ్ ప్రాంత పానా నిర్వహణ బాధ్యత వహి-స్తున్నాడు.

ఇలాంటి సందర్భంలో బ్రిటిష్ ప్రభు-త్వం రౌట్ బ్లిను ప్రవేశపెట్టింది. 1917 ఆగష్టులో. బాధ్యతాయుత ప్రభు-త్వన ఏర్పాటు చేస్తామంటూ ప్రజకు వాగ్దానం చేశారు. కాని మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కూడా వారు మాట నిబెట్టుకోలేదు. రౌట్ బ్లి 1919 సంవత్సరం మార్చి 18వ తేదీన చట్టంగా రూపొందింది. విప్ల-వోద్యమాను, అరాచక చర్యను నిర్మూ-లించ డానికి ఈ చట్టాన్ని తెచ్చినట్లు బ్రిటిష్ పాకు సెవిచ్చారు.




ఇందుకు నిరసనగా 30 మార్చి 1919న దేశవ్యాప్తంగా శాంతియుత నిరసన ప్రదర్శను జరిగాయి. ఢల్లీ అమృతసర్ తదితర చోట్ల 6 ఏప్రిల్ నాడు బ్రహ్మాం-డమైన హర్తాళ్ జరిగాయి. 7 ఏప్రిల్ రోజు ప్రజ కోరికపై మహాత్మాగాంధీ` పంజాబ్‌కు బయుదేరాడు` కాని బ్రి-టిష్‌వారు ఆయనను నిర్బంధించి బొంబాయికి పంపివేశారు. ఈ చర్యవ్ల భారతీయు సహనం నశిస్తూ వచ్చింది. దేశమంతా అట్టుడికి పోయింది. ఆ రోజు అమృతసర్ నగరంలో జరిగిన బహిరంగ సభకు ఏభైవేకు పైగా ప్రజు పాల్గొన్నారు. డాక్టర్ కిట్లు, డాక్టర్ సత్య-పాల్ నాయకత్వంతో 9 ఏప్రిల్ 1919న అమృతసర్ జరిగిన ఊరేగింపు-లో మతాకతీతంగా భారతీయులంతా పాల్గొని తమ మాతృదేశభక్తిని, ఐక-మత్యాన్ని చాటుకున్నారు. ఇది ఓర్వ-లేక, ఆనాటి గవర్నర్ మైకెల్ ఓడ్వ-యర్ దేశభక్తులైన కిట్లు, సత్యపాల్‌కు మరుసటి రోజే (10 ఏప్రిల్, 1919) దే-శాంతరవాస శిక్ష విధించారు. తిరస్కార సూచకంగా ప్రజు శాంతియుత హర్తాళ్ (ప్రదర్శన) జరిపారు.

13 ఏప్రిల్ 1919`భారతీయ చరిత్రలో ముఖ్యమైన రోజు : 'వైశాఖీ' పండుగ దినం కావడంవ్ల ప్రజు ఆనందోత్సాహా-తో సంబరాు చేసుకున్నారు. పంజాబ్ ప్రాంత ప్రజకు వైశాఖీ అతి ముఖ్యమైన పండుగ. ఆనాడు వారంతో తమ దేశ గౌరవాన్ని నిబెట్టాని, స్వాతంత్య్ర స్వేచ్ఛ-ను తెలియపరచే క్ష్యంతో స్వర్ణమం-దిర సమీపంలోని 'జలియన్‌వాలా



బాగ్ (మైదానం)లో సమావేశమైనారు. (అమృతసర్‌లో నేటికి కూడా మనం ఈ చారిత్రక మైదానాన్ని చూడవచ్చు). అందరూ చేరిన ఈ మైదానం చతురస్రాకారంలో ఉండి కేవం ఒకే ఒక ప్రవేశ ద్వారం కల్గినట్టిది. సమావేశమైన దేశ ప్రజంతా నిరాయుధు. మైదానమంతా దేశభక్తుతో కిటకిటలాడుతుంది. సాయంత్రం అయిదు ఘంట సమయం వేదికపై కొందరు నాయకున్నారు. దేశభక్తి పూరిత వాతావరణం `సభ ప్రారంభమయ్యే సమయం ` అంతలోనే సైనికుతోపాటు జనరల్ ఓడ్వయర్ అక్కడికి చేరుకున్నాడు. కనీసం హెచ్చరికనైనా చేయకుండా డ్వయర్ ఆజ్ఞానుసారం సైనికు క్పాకు తెగబడ్డారు. నిరాయుధులైన దేశభక్తు అనుకోని ఈ సంఘటనకు నిర్దాక్షిణ్యాంగా బయ్యారు. 15 నిముషాసేపు ఆగకుండా తుపాకి గుండ్లు పేలాయి.

మృత్యుదేవత వియతాండవం చేసింది. దేశభక్తు భారతమాత విమోచనానికి ప్రాణార్పించారు.

జలియన్‌వాలా మైదానం మెవకి రావడానికి, కేవం ఒకే ఒక ద్వావరం. అతి కష్టంమీద నాుగైదు ప్రదేశా నుండి గోడ దూకి బయటపడవచ్చు. ఇలాంటి ప్రదేశంలో 1650 తుపాకి గుళ్లు పేలాయి. మైదానమంతా వందలాది దేశభక్తు రక్తపు క్వాతో భయంకరంగా తయారైంది. ఆనాటి రాత్రి కర్ఫ్యూ విధించబడిరది. దీనికంతా జనరల్ డ్వయర్ కారకుడు. ఆయన వెంబడి ఉన్న సైనికుల్లో కొందరు బ్రిటిష్‌వారున్నా, చాలామంది భారతీయ సైనికుండడం గర్హించదగింది. నేడు కూడా ఇలాంటి సంఘద్రోహు కొందరు ఉండడంవ్లనే దేశభక్తి, జాతీయుత, మాతృవందనం లాంటి అంశాల్లో కూడా చర్చ జరగడం అది హేయమైన విషయం.

బ్రిటిష్‌వారి నిరంకుశ విధానాన్ని ఎదిరించి అమరవీరులైన ఈ ప్రదేశం 'జలియన్‌వాలాబాగ్' నేటికి కూడా చరిత్రకు సాక్షిగా నిలిచింది. ఇక్కడ తమ ప్రాణార్పించిన దేశభక్తుకు నేడు, స్మృతి చిహ్నా నిర్మించబడినాయి. వారికి మన జోహార్లు.

నేడు భారతీయ చరిత్రలో చారిత్రిక సత్యాను, హైందవజాతి ఔన్నత్యాన్ని, గౌరవాన్ని నిబెట్ట ప్రయత్నించి, విదేశీ పాకుతో పోరాడిన దేశభక్తు జీవితాంశాను చేర్చి, తద్వారా నిజమైన మన జాతీయ చరిత్రను యువతరానికి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో జలియన్‌వాలాబాగ్ ఒకటి.

ఆచార్య మత్స్యరాజ హరగోపాల్
hargopal48@gmail.com

# అమృతం కన్నఅమ్మ పాలు మిన్న

డా .ఎస్. కృష్ణమూర్తి శాస్త్రి

పోతపాలతో నష్టాలు:

1) విరోచనాలు కావచ్చు

2) శ్వాసకోశ ఇబ్బందులు రఎక్కువ కావచ్చు.

3) A విటమిన్ తగ్గి కంటి జబ్బులు రావచ్చు

4) పాల ఎలర్జీ రావచ్చు

5) జీర్ణకోశ వ్యాధులు రావచ్చు

6) దీర్ఘవ్యాధులు రావచ్చు. చిన్న పిల్లల్లో క్షయ, కాలేయవ్యాధి మొదలైనవి

7) ఊబకాయం రావచ్చు.

8) IQ తక్కువగా ఉంటుంది

ఈ క్రింది పరిస్థితుల్లో తల్లిపాలు అంతగా ఉపయోగపడవు:

1)చంటి పిల్లలలకు 'గాలాక్టోసీమియా' వ్యాధి ఉంటే అంత పనికిరాదు. కారణం పిల్లల్లో పాల లోని పిండి పదార్థాలు జీర్ణం చేసుకునే శక్తి

లేకపోవడం.

2) తల్లికి క్షయ రోగం ఉధృతంగా ఉండి ఎటువంటి చికిత్సా తీసుకోనప్పుడు

3) అమ్మకు రేడియం చికిత్స, కెమోథెరపీ ఇస్తున్నపుడు

4) అమ్మ మత్తుమందులకు బానిస అయినప్పుడు

5) అమ్మ రొమ్ము మీద, చంటి మొన మీద సర్పి వ్యాధి ఉన్నపుడు

6) అమ్మకు హెచ్ ఐ వి (ఎయిడ్స్) వ్యాధి ఉన్నపుడు

ఈ క్రింది పరిస్థితుల్లో ప్రమాద హెచ్చరికలున్నా పాలివ్వవచ్చు.

1) అమ్మకు హెపటైటిస్ బి లేదా హెపటైటిస్ సి ఉన్నపుడు

2) అమ్మకు పొగ త్రాగడం అలవాటున్నపుడు - కనీసం బిడ్డను ఎత్తుకున్నపుడు, పాలిచ్చేటప్పుడు పొగ త్రాగడం చేయకుండా ఉంటే

సరిపోతుంది.

3) ఆల్కహాల్ - చాలా మితంగా అప్పుడప్పుడు తాగితే ఫరవాలేదు.

4) శిశువు పసికర్ల వ్యాధితో జన్మించినప్పుడు. 4. కాన్సర్ రాకుండా చేస్తుంది.

5 . మనస్సుకు ఉల్లాసాన్ని కలిగిస్తుంది.

హోమియో చికిత్స :

పాలు తక్కువగా ఉత్పత్తి అవుతుంటే - అమ్మకు - ఆగ్నసు, అసపటిడా కాల్కేరియా, పల్సటిల్లా, లాక్ కనైనం, సెపియా, అర్టికా, రిసినస్ కమ్యూనిస్, అల్ఫాల్ఫా మొదలగు మందులు పాలను అభివృద్ధి చేయటానికి తోడ్పడతాయి.

రొమ్ము వ్యాధి వల్ల కూడా ఒక్కోసారి పాలివ్వడానికి ఇబ్బంది రావచ్చు.

అగారికస్ : చంటి మొనలు దురదగా ఉండి మండుతుంటాయి.

ఆర్నికా: ప్రసవానంతరం స్థనాల్లో నెప్పిగా ఉంటుంది.

బొరాక్స్: స్తన మొనలు కురుపులుగా తయారవుతాయి. స్తనాలు ఖాళీగా ఉన్నట్లుగా ఉంటుంది.

కాల్కేరియా కార్బ్: రొమ్ముగట్టిపడుతుంది. ఒక్కోసారి చీము కారుతుంటుంది.

కామోమిల్లా: తీవ్రమైన నెప్పులుగా స్తనాలు ఉంటాయి ముఖ్యంగా చంటి మొనలు. దానితో కోపం చిరాకు ఎక్కువ.

గ్రాఫైటిస్: నెప్పులుగా, మంటలుగా జిగట లాంటి దారం చనుమొనల పగుళ్ళనుండి వస్తుంది.

ఫైటోలక్క: గట్టిపడ్డ స్థనాలు పగుళ్లు చూపి ఉంటాయి. తాకితే నెప్పి, స్థనాల నుండి నెప్పి శరీరం అంతా వ్యాపిస్తుంది.

సైలీషియా: పాలు త్రాగేసిన తర్వాత స్తన్యాన్ని తోసేస్తుంది. పాలను ఇష్టపడదు.

బెల్లడోనా: పాలు ఎక్కువగా స్రవించినట్లయితే.

నేట్రం కార్బు : పాలు పడవు. పిల్లలకు విరేచనాలవుతాయి. పొట్ట ఉబ్బరంగా ఉంటుంది.

పల్సటిల్లా: పాలు తక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఎంత చీకినా పాలు సరిపడనంతా రావు. పాలు వచ్చినా విరిగిపోయిన పాలలా వస్తాయి. రొమ్ములు గట్టిగా ఉంటాయి.

# నవవిధ భక్తులు

## దాస్యం

ఆదూరి హైమవతి



" కుమారీ! ఈ రోజు ఏడవదైన భక్తి మార్గాలలో దాస్యము అనే దాన్ని గురించీ చెప్తాను, విను. దాస్యము అంటే అర్థాలు నీకు తెలిసే ఉంటాయి, ఐనా చెప్తున్నాను. దాస్యానికి సేవ, పని అనే అర్థాలున్నాయి.

విజయ నగరంలో ఒక పెద్ద హాస్పెటల్ కు స్వంతదారు స్వరాజ్య లక్ష్మి . ఒకరోజున ఆమె ఉదయం వాహ్యాలికి ఒంటరిగా వెళుతూ ఒక పార్కులో మెల్లిగా నడుస్తున్నది.

ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న ఆమె ముందు వేగంగా పాకిపోతున్న పామును చూడనేలేదు. దానిమీద కాలేయడం అది కాటు వేసి, జరజరా గుట్టల్లోకై పాకి వెళ్ళడం జరిగిపోయింది. దూరంగా చెట్టుక్రిందకూర్చునున్న నందిని అనే ఒక పదేళ్ళ అనాధ బాలిక , అదిగమనించి , వేగంగా వచ్చి కళ్ళుతిరిగి పడిపోతున్న స్వరాజ్య లక్ష్మిని పట్టుకుని క్రింద పడుకోబెట్టింది.వెంటనే తన చిరుగుల పరికిణా చింపి పాదానికి పైన గట్టిగా కట్టింది. తన జాకెట్టుకున్న సేఫ్టీ పిన్ను తీసి పాము కాటేసిన చోట గుచ్చి పాదాన్ని గట్టిగా వత్తి రక్తాన్ని బయటికి పిండింది.

పరుగున వెళ్ళి తాను నీళ్ళుత్రాగను ఉంచుకున్న సీసాలోకి అక్కడి ట్యాప్ నీళ్ళు పట్టితెచ్చి , గాయాన్ని కడిగి మళ్ళా మరోమారు ఆపాదం వద్ద గుచ్చి గట్టిగా పాదాన్ని నొక్కింది. అలా మూడు నాలుగు మార్లు చేసింది. అప్పటికి తెల్లవారు తుండగా పార్కులో నడవను వచ్చిన కొందరు , డాక్టర్ స్వరాజ్య లక్ష్మిని చూసి , వెంటనే ఒక ఆటో-పిలిచి ఆమెను ఆమె హాస్పెటల్ కు పంపారు. ఆమె వెంట నందిని కూడా వెళ్ళింది. ఆమెను హాస్పెటల్ వారు గబగబా ఒక ప్రత్యేక గదిలో ఉంచి వైద్యం అందించారు.ఆ అమ్మాయి అక్కడే బయట కూర్చుని ఉంది. స్వరాజ్య లక్ష్మికి మెలకువరాగానే ముందుగా, ఆ అమ్మాయి గురించీ అడిగి దగ్గరకు పిలిపించుకుంది.

ఆమ్మాయి పేరు అడిగి తెల్సుకుని , నందినికి తిననూ కట్టుకోనూ ఏర్పాట్లు చేయించి ఒకరోజంతా హాస్పెటల్లో ఉన్నాక తనతో నందినిని తన ఇంటికి తెచ్చుకుంది.

వారంపాటు విశ్రాంతిగా వున్న స్వరాజ్య లక్ష్మిని, ఎందరు సేవకులున్నా నందిని తానే దగ్గరుండి అన్నీచూసుకుంది.

ఒకవారమయ్యాక స్వరాజ్య లక్ష్మి ఆరోగ్యంగా లేచి తిరగసాగింది. నందినిని దగ్గరకు పిలిచి వివరాలు అడగ్గా , నందిని, తనకున్న ఒకేఒక అవ్వ చనిపోవటాన ఆపార్కులో రాత్రులు పడుకుంటున్నాననీ చెప్పింది.ఐదో క్లాసు వరకూ సర్కార్ బళ్ళో చదువుకున్నాననీ అవ్వ పోయాక ఆమె పూరిపాకాను ఎవరో ఆక్రమించుకుని తనను తరిమేశారనీ చెప్పింది.

స్వరాజ్య లక్ష్మి అడిగినదానికి తనకు ఐదో తరగతిలో సైన్సులో పాఠంలో ప్రధమచికిత్స ఎలాచేయాలో తేలు, పాముకరిస్తే ఏం చేయాలో పంతులు గారు చెప్పినది గుర్తుండి చేశానని చెప్పింది.

వివాహంకాని స్వరాజ్య లక్ష్మి, ధైర్యంగా ఎవరో తెలీని తన ప్రాణం కాపాడిన నందినిని తన పెంపుడు కుమార్తెగా దత్తు తీసుకుని వైద్యం చదివించి గొప్ప డాక్టరుగా చేసి తన హాస్పెటల్ అప్పగించింది. అదమ్మా కుమారీ సేవ వలన చేకూరే లాభం. మానవ సేవే మాధవ సేవ ఐనా దానివలన చేకూరే లాభం మాత్రం చాలా గొప్పది." అని ముగించింది బామ్మ.

# మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

## నందుల ప్రభాకర శాస్త్రి



ప్రగతి పథంలో పయనించాలనుకున్న యువత చదువులపై దృష్టి సారించారు. పలుగురాళ్ళపల్లె ఉన్నత పాఠశాలలో యస్.యస్.ఎల్,సి. పూర్తి చేసిన పిల్లలు చాలామంది తిరుపతిలో బి.విద్వాన్ లో చేరిపోయారు. మా అన్నదమ్ములం మదనపల్లె బిసెంటు థియోసాఫికల్ కాలేజీలో చేరిపోయాం. మా చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉంటూ... అప్పుడప్పుడు ఊరికి వచ్చేవాళ్ళం.

పెద్ద గోపవరం రామన్న (రామిరెడ్డి) గారి ఉమ్మడి కుటుంబం విడిపోయింది. ఆస్తిపాస్తులు పంచుకుని ఎవరి కుటుంబం వారైపోయారు. మా కుటుంబం విషయానికి వస్తే ... మా అత్తగారిచ్చిన ఆస్తి అయిపోగానే పెళ్లిళ్లకు, చదువులకు స్థిరాస్తి అంటా అమ్మేశారు. రోజువారీ భోజనం నడవడానికి ఇంట్లో వున్న వెండి, బంగారు ఆభరణాలు అన్నీ... అప్పుడప్పుడు తాకట్టు పెట్టి నిత్యావసర వస్తువులు తెచ్చుకున్నారు. పొలాలన్నీ కూడా చదువులకు, పెళ్లిళ్లకు, ఉపనయనాలకు తాకట్టు పెట్టారు. కనీసం అమ్మివుంటే మంచి రేటు పలికివుండేది. 'అహం' అడ్డం వచ్చి అమ్మకుండా 'తాకట్టు' పెట్టటం... అవి ఈ జన్మలో విడిపించుకోలేకపోవటం.

ఆస్తి తరిగిపోయినకొద్దీ మా పెదనాన్నలో అభద్రతాభావం మొదలైంది. వయస్సు మీద పడటం .. తన చివరి రోజుల్లో ఎవరు ఆసరాగా వుంటారన్న సమస్యలు వేధించే సమయంలో మా ఆదెమ్మక్క, కామయ్య బావ వచ్చి ఆస్తి పంపకం చేసుకుని, ఇల్లు, తోట, కళ్ళం ... కొంత పొలం భాగం పంచుకుని పెద్దనాన్నని పిలుచుకుపోయారు. ఇక్కడ పుట్టి... ఇక్కడ పెరిగి, ఈ మట్టి వాసన చూచిన ఆయన అక్కడ వుండలేక, ఇక్కడికి వస్తే, ఊర్లోవాళ్ళు 'ఆస్తి పంచుకుని ఇక్కడేం బాముకుందామని వచ్చావు' అనే సూటీపోటీ మాటలు భరించలేక.. సతమతమవుతూ ఉండేవాడు. అమ్మ మాత్రం... అలాగే ఆదరించేది. అప్పుడే ఋషీ వ్యాలీలో నాకు ఉద్యోగం వచ్చింది. నెలకు వంద రూపాయలు జీతం. ఉచిత భోజన వసతి కల్పించారు. కేవలం ఇరవై రూపాయలు మాత్రం ఉంచుకుని ఎనభై రూపాయలు ఇంటికి పంపేవాడిని. అవి పెద్దనాన్న తీసుకుని నావి అని గొడవ చేసి మళ్ళీ ఇచ్చేవాడు. నేను పంపే ఈ ఎనభై రూపాయలకు తోడు నాన్న 'సంచారం' పోయి అంతో ఇంతో సంపాదించేవాడు. మా పెద్దత్త, అమ్మ, నాన్న, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు బ్రతికేవారు.

లంకంత ఇల్లు కూలిపోయింది. కేవలం రెండు అంకణాలు మాత్రం పడిపోకుండా ఉండేది. అందులో మా పెద్దత్తను అవసానసమయంలో ఉంచారు. ఋషి వ్యాలి వదిలి హైదరాబాదులో ఉద్యోగం వెతుక్కున్నాను. ఋషి వ్యాలి స్కూల్లో వచ్చిన ప్రావిడెంట్ ఫండ్ ఐదు వందలతో భాకరాపేటలో 'కుటీరం' నిర్మించాలనుకున్నాం. సుబ్బన్న, నేను ముటుకుందారు పల్లెకు పోయి కొట్టం సామాను మాట్లాడి, మే నెలలో... నెలంతా పట్టింది కొట్టం పూర్తయ్యేనాటికి.

(ఇంకా వుంది)



# శ్రీ వచన భూషణం



(గత సంచిక తరువాయి)

శ్రీ వేంకటాచార్యులు



కొంతమంది సూయాపరులు ఈ గ్రంథం ధర్మ వ్యతిరేక అంశాలతో నిండియున్నది అసత్య ప్రచారం చేస్తుంటే రంగనాథుడు విని... తానూ ఆమోదించిన గ్రంథంగా లోకులకు తెలియజేస్తే, వారు ఆచరించే అవకాశం ఉందని భావించి, తనకు శ్రీ వచన భూషణ గ్రంథాన్ని పిళ్ళై లోకాచార్య స్వామివారిచే వినిపింపజేయమని అర్చక ముఖతా ఆదేశించగా ....వారు ఇంట లేనందున వారి సోదరులు అళగియ మనవాళ పెరుమాళ్ నాయర్ రంగనాథుని సన్నిధికి చేరి గ్రంథాన్ని స్వామికి చదివి వినిపించారు.శ్రీ రంగనాథుడు ఆనందంతో వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించి పంపమని ధర్మకర్తలు ఆదేశించినట్లు వారు అళగియ మనవాళ పెరుమాళ్ నాయర్ ను సత్కరించినట్లు ఆధారిత గ్రంథాలు తెలియజేస్తున్నాయి. అళగియ మనవాళ పెరుమాళ్ నాయర్ కూడా 'ఆచార్య హృదయం' వంటి పలు ఉత్తమ గ్రంథాలను మనకు అందించియున్నారు. వీరు అన్నదమ్ములు ఇరువురూ శ్రీ వైష్ణవ ధర్మ ప్రచారం కొనసాగిస్తూ అనేకమంది శిష్యులను ఉత్తమ ప్రచారకులుగా తీర్చిదిద్దారు. వీరిలో 'తీరుతాయారు' అనే మహిళా కూడా సకల వేదాన్తములను అభ్యసించిన ఆధారాలు వున్నాయి. వీరి ప్రచారంలో 'రామానుజ సిద్ధాంతం' సర్వ శాస్త్ర సమ్మతమని అనేక ప్రమాణాలు ఆధారంగా నిరూపిస్తూ ప్రచారం గావించేవారు.

మణల్ పాకం అనే గ్రామం లోని నంబిగారు పిళ్ళై లోకాచార్య స్వామి సాక్షాతూ కంచి వరదరాజుల అవతారంగానే భావిస్తారు. నంబిగారు తాను సేవిస్తున్న గ్రంథాలలో భావాలు వారికి స్ఫురించక ఇతర పండితులను అడగలేక కంచి వారసుని సన్నిధికి చేరి స్వామిని ప్రార్థింపగా, ఆరోజు రాత్రి కలలో కొంత విషయాన్ని వివరించి, మిగిలిన విషయం మణల్ పాకం అనే గ్రామం లోని నంబిగారు పిళ్ళై లోకాచార్య స్వామి సాక్షాతూ కంచి వరదరాజుల అవతారంగానే భావిస్తారు. నంబిగారు తాను సేవిస్తున్న గ్రంథాలలో భావాలు వారికి స్ఫురించక ఇతర పండితులను అడగలేక కంచి వారసుని సన్నిధికి చేరి స్వామిని ప్రార్థింపగా, ఆరోజు రాత్రి కలలో కొంత విషయాన్ని వివరించి ,మిగిలిన విషయం 'నేను నీకు శ్రీరంగనాథుని సన్నిధిలో స్వయంగా కనిపించి తెలిజేస్తాను, ఆ సమయంలో నీకు ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే



ప్రత్యక్షంగా అడిగి తెలుసుకోవచ్చు' అన్నారుట. ఆనాటి నుండి వీరు శ్రీరంగనాథుని సన్నితుకి చేరి తనకు కంచి వరదుడు అందించిన రహస్యార్థాలను నెమరు వేసుకుంటూ స్వామివారి రాకకు ఎదురుచూస్తున్నారు. ఒకరోజు మనల్ పాకం నంబిగారు కూర్చున్న చోటు ప్రక్కన ఖాళీ స్థలం ఉంటె అక్కడకు పిళ్ళై లోకాచార్యస్వామి వారు వారి శిష్యులందరితో చేరి.... తనకు కంచి వరదరాజులు చెప్పిన విషయాన్ని. వారి శిష్యులందరికీ వివరించి తనకు శ్రీరంగంలో చెబుతానన్న విషయాన్ని కూడా వివరించి, ఏదైనా అనుమానాలు ఉంటే అడగవచ్చు అని వారి శిష్యులతో పాటు మనల్ పాకం నంబి వైపు కూడా చూశారుట. నంబిగారు ఎంతో ఆనందంతో సాష్టాంగ నమస్కారం చేసి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ 'మీరు వారేనా' అన్నారుట. దాంతో పిళ్ళై లోకాచార్యస్వామి చిరునవ్వు నవ్వుతూ వారిని ఆశీర్వదించి అక్కడనుండి ప్రయాణం కొనసాగించారుట. ఆనాటి నుండి మనల్ పాకం నంబిగారు పిళ్ళై లోకాచార్యస్వామి వారు కంచి వరదరాజుల అవతారంగా ప్రచారం చేశారు. విశిష్టాద్వైత సిద్ధాంత వ్యాప్తి రామానుజుల నుండి - ఎంబార్- తదుపరి పరాశర భట్టార్ - తదుపరి నంబీయర్ - తరువాత వారి శిష్యులు నంబిల్లై ఆనాటి వైభవం ఏమాటర్మ్ తగ్గకుండా పిళ్ళైలోకాచార్య స్వామి ఎంతో కృషి చేశారు.

భారతదేశంలో తురుష్కులు దండయాత్రలు జరిపి హిందూ దేవాలయల సంపద దోచుకోవడం, విగ్రహాలను, ఆలయాలను ధ్వంసం చేయడం జరుగుతోంది. ఈ ముప్పు శ్రీరంగనాథుని ఆలయానికి అందలి స్వామి అర్చా స్వరూపాలకు ప్రమాదం రాబోతోందని శిష్యుల ద్వారా ముందుగా గ్రహించి, అప్పటికప్పుడు మూలమూర్తికి రక్షణగా గోడ కట్టించి తొందరగా శ్రీరంగం



నుండి బయటపడాలని భావించి శ్రీరంగనాథుని అర్చామూర్తులతో శత్రువుల కంటపడకుండా వాటి రక్షణయే ధ్యేయంగా అడవుల వెంబడి నడుస్తూ, దారోలో అనేక కష్టాలు ఎదుర్కుంటూ మధురకు సమీపంలోని జ్యోతిష్కుడి గ్రామం చెడి అర్చామూర్తుల రక్షణకు చక్కని చోటుగా భావించి అక్కడే నివసిస్తూ.... స్వామి స్వరూపములను భద్రంగా శిష్యులకు అప్పగించి, క్రీ.శ. 1311 సం || లో (సుమారు 105 సంవత్సరాలు) శరీరంలో దేవుడు కొనసాగినంతవరకూ పరమాత్మ సేవయే ధ్యేయంగా కొనసాగి పరమపదం చేరారు.

వీరు మనకు అందించిన శ్రీ వచనభూషణం పూర్తి జ్ఞానసారఫలం మరియు ఆచరణ గ్రంథంగా కూడా కీర్తింపబడింది. ఈ గ్రంథం సేవించకుండా ఎన్ని ఆధ్యాత్మిక గ్రంథాలు సేవించినా సంపాదించే జ్ఞానం పరిపూర్ణ ఫలాన్ని ఇవ్వదని పెద్దలు తెలియజేస్తారు. గాన ఈ గ్రంథాన్ని అస్మత్ ఆచార్యు, భగవత్ భాగవతుల అనుగ్రహ కటాక్షంతో చక్కగా తెలుసుకుందాం.



(ఇంకా వుంది)

# క్రాస్ వర్డ్ పజిల్స్ - కథా కమామీషు -1



చాగంటి కృష్ణకుమారి

కానీ దీనికి పూర్వమే 19వ శతాబ్దం లోనే క్రాస్ వర్డ్ పజిల్ ఇటాలియన్ భాషలో "per passare il tempo" గా వాడుకలో వుంది.

ఈ పదానికి అర్ధము "to pass the time."అని. అంటే 'కాలక్షేపానికై' . వీటిని రూపొందించే వారిని క్రుసి- వెర్బాలిస్ట్ లు (cruciverbalists) అంటారు.ఈ పదం లాటిన్ పదాలైన crux , verbum,లనుండి పుట్టింది . ఇంగ్లీషు లో Crux ని cross అనీ verbum ని "word." అనీ అంటారు కనక ఈ రెండూ కలసి cross word అయింది.

నిజానికి ఆర్థా విన్ పజిల్ ని పాఠకుల 'కాలక్షేపం కోసం మాత్రమే రూపొం- దించలేదు .అవి మొదటి ప్రపంచ- యుద్ధపు రోజులు .యుద్ధ వాతావర- ణపు భీతి, నిరాశ , నిస్పృహలనుండి జన సామాన్యుల మానసిక స్థితిని మరల్చి ఊరటనిచ్చేందుకు తన పజిల్ ని ఒక తప్పనిసరి సాధనంగా భావించాడు .ప్రజానీకానికి ఒకానొక వ్యాపకంగా వాడుకలోకి తెచ్చాడు. అందమైన డైమండ్ ఆకారంలో ఖాళీ గడులను పేర్చి వాటిని అక్ష- రాలతో నింపడానికి పాఠకుల- కు సూచనలను తయారు చేసి ఇచ్చాడు. అతనిచ్చిన ఆధారాలను బట్టి పాఠకులు పదాలను కనిపెట్టి గడులను నింపాలి. దీనికి అతను పెట్టిన పేరు "FUN's Word- Cross Puzzle." కొన్ని వారాల తరువాత ఒకసారి పేపరులో దొర్లిన అచ్చు తప్పు వల్ల అది "Cross- Word,"అనే శీర్షికతో వెలువడింది. అదే ఖాయమైపోయింది.

1920 నాటికి అమెరికాలో పాఠకుల మెదడుకు వినోదానివ్వగల కాలక్షే- పానికి క్రాస్ వర్డ్ పజిల్స్ ని చాలాప- త్రికలు ప్రవేశపెట్టాయి.ఒకదశాబ్దం తిరిగేసరికి సుమారుగా అమెరికాలో అన్ని పత్రికలలోనూ ఒక్క Times లో తప్ప ఇవి చోటుచేసుకొన్నాయి. అయితే వీటిలో కొన్ని చాలా జాగ్ర- త్తగా చూసి పరిష్కరించినవి కాగా కొన్నింటిలో తప్పులు దొర్లడమూ వుంది. పజిల్ నిర్మాణరూపంలో కూడా ఒక పద్ధతంటూ లేకుండా వుండేవి.ఆధారాలివ్వడంలో, పదాల ఎంపికలో పలుచదనం చోటు చే- సుకొవడమూ వుండేది.

బ్రిటన్ లో తొలిసారిగా 'Pearson's Magazine' లో 1922 ఫిబ్రవరిలోనూ , 1930 ఫిబ్రవరి 1న Times లో నూ క్రాస్వర్డ్ పజిల్స్ శీర్షికలు చేరాయి.

అమెరికన్ పజిల్స్ కన్నా బ్రిటీష్ క్రా- స్వర్డ్ పజిల్స్ తమదైన ముద్రను సంతరించుకొన్నాయి . మెదడుకి బాగా పని కల్పించేవిగా తయా- రయ్యాయి.ఎ.ఎఫ్.రిట్చి, డి.ఎస్. మాక్నట్ (A. F. Ritchie and D. S. Macnutt) ఆధారాలు ఇవ్వడం- లో పాఠకులను తికమక పెడుతూ చమత్కారాలతో పజిల్స్ పూరించ- డానికి అవసరమైన మేధో స్థాయిని- పెంచి పూరణ కర్తల మెదడులకు పదును పెట్టారు. పజిల్స్ రూపక- ర్తలకు కొన్ని సుత్రాలను నిర్దేశించా- రు. చక్కని జ్యామితీయ నిర్మాణా- లలో పదాలు నృత్యం చేస్తున్నాయా అని అనిపించేటంతగా స్వహస్తా- లతో వీరు రూపందించన వేల కొద్దీ పజిల్స్ పాఠకులను విశేషంగా ఆకట్టు కొన్నాయి. వీటిని cryptic puzzles అంటారు. ఎందుకంటె మర్మగర్భితంగా ఇచ్చిన సూచన ఆధారంగా పూరించాల్సిన పదాన్ని కనిపెట్టడానికి కొంత శ్రమపడాలి.

(ఇంకా వుంది)

# వైజ్ఞానిక పద బంధ కేళి

## మే 2021 నెల గడి- నుడి సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| వా | పు | | నూ | నూ | గు | | ద | గ్గు |
| మ | దీ | నా | | నె | | గ | ర్భ | ము |
| | న | | ప | శు | వు | | లు | |
| వే | | బా | | ద్ధి | | సో | | వి |
| పా | ర | ద | ర్శ | క | ప | దా | ర్థ | ము |
| కు | | ము | | ర్మా | | లు | | ఖం |
| | పిం | | తూ | గా | డు | | రం | |
| మా | గా | ణి | | ర | | సు | స్థి | ర |
| వా | ణి | | స | ము | ఖం | | అ | ట్లు |

## ఏప్రిల్ 2021 నెల గడి- నుడి సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| జే | మ్స్ | చా | డ్వి | క్ | | ల్ | రా | క్లో |
| మ్స్ | | ర్లె | | రి | | సా | | రి |
| వా | | స్ | ర | క్లో | | లై | సీ | న్ |
| ట్స్ | | | జు | | సీ | | | |
| న్ | డ | తో | | | | నం | థ | మం |
| | | | ఠీ | | ల | | | యు |
| జ్ | క్లే | లా | | చే | తు | లే | | ని |
| ల్టో | | క్టో | | త | | కూ | | ల్ |
| మా | ల్టే | జ్ | | న్ | ల్వి | కె | ల్ | జౌ |

# వంటలు - పిండివంటలు



భారతీ శర్మ

ఈ శీర్షికలో మనం కరకరలాడే రిబ్బన్ పకోడీ తయారీ విధానం, చూస్తూనే నోరూరే రవ్వలడ్డూ తయారీ విధానం చూద్దాం! బజారులో దొరికేవాటి కంటే ఎంతో రుచికరంగా వీటిని ఇంట్లోనే చాలా సులభంగా తయారుచేసుకోవచ్చు. ఆరోగ్యానికి మంచిది కూడా! మా వంటింట్లో తయారు చేసిన ఈ స్వీటు, హాటు ఫోటోలను కూడా జతపరుస్తున్నాను.

తయారీ విధానం లోకి వెడదాం!

మొదటగా రిబ్బన్ పకోడీ (దీనినే గట్టి పకోడీ అని కూడా అంటారు).

దీనికి కావలసిన పదార్థాలు:

బియ్యప్పిండి 2 గ్లాసులు

శనగపిండి 1 గ్లాసు

నువ్వులు 1 చెంచా

వాము 1 చెంచా

ఇంగువ కొద్దిగా

ఉప్పు 2 చిన్న చెంచాలు

కారం 2 చెంచాలు

వెన్న, బటర్, లేక వేడి నూనె 3 చెంచాలు

బియ్యాప్పింది, శనగపిండి, నువ్వులు, వాము, ఇంగువ, ఉప్పు, కారం అన్నీ ఓ వెడల్పు బేసిన్ లో కలుపుకోవాలి. ఆ తరువాత బటర్ లేక నూనె - వెన్నపూస అయితే అలాగే వేసి గోరువెచ్చని నీతితో పిండిని కలుపుకోవాలి. గట్టిగా ఓ ముద్దలా చేసుకుని మూత పెట్టి 10 నిముషాలు ఉంచుకోవాలి. ఈ లోగా బాణలిలో నూనె వేవేడెక్కుతుంది కదా . నూనె కాగాక జంతికల గొట్టంలో మైనస్ ఆకారం గల రిబ్బన్ పకోడీ బిళ్ళను పెట్టుకుని, కొద్దీ ముద్దను తీసుకుని నీళ్లు చిలకరించి జంతికల గొట్టంలోకి జారేలా పిండిని కలుపుతూ గొట్టంలో నింపి - నూనెలోకి గుండ్రంగా చుట్టుతూ వత్తుకోవాలి. కొద్ది సేపు ఒక వైపు వేగాక పొయ్యి తగ్గించుకుని తిరగవేసి 5 నిముషాలలో తీసి టిష్యూ పేపర్ వేసిన ప్లేట్లోకి వేసుకోవాలి. ఇలా మిగతా పిండిని చేసుకోవాలి. చాలా రుచిగా కరకరలాడుతుంటాయి.





రవ్వలడ్డు:

రవ్వలడ్డు తయారీకి కావలసిన పదార్థాలు:
సూజీ రవ్వ. 1 కప్పు
పంచదార 1 కప్పు లేదా ముప్పావు కప్పు - రుచిని బట్టి
కొబ్బరికోరు అర కప్పు
గోరువెచ్చని పాలు పావు కప్పు
నెయ్యి. 5 చెంచాలు
యాలక్కాయలు పొడి అర చెంచా
జీడిపప్పు, కిస్ మిస్ లు 20 వరకు

ముందుగా ఓ పొడి మూకుడులోకి 3 చెంచాల నెయ్యి వేసి సూజీ రవ్వని దోరగా వేయించాలి. అందులోనే కొబ్బరికోరు కూడా వేసి మిగిలిన రెండు చెంచాల నెయ్యితో కమ్మని వాసన వచ్చే-వరకు వేయించాలి. ఇప్పుడు అందులో పంచదార కలపాలి. తీపి ఇష్టపడితే సమాన కొలత (రవ్వతో) లేదా పంచదార కాస్త తక్కువ వేసి కలిపి అందులో యాలక్కాయ పొడి వేసి పొయ్యి కట్టేసి ... అందులో గోరువెచ్చని పాలు కలపాలి. చెయ్యి పట్టే వేడిగా యున్నప్పుడు ఈ రవ్వలడ్డులు చుట్టుకుంటూ పైన జీడిపప్పు కిస్ మిస్ ను అతికించాలి. ఇష్టమైనవారు వీటిని కూడా నేతిలో దోరగా వేయించుకోవచ్చు. అలా పచ్చివి అద్దినా చాలా రుచిగా ఉంటాయి. ఈ పంచదారని కొందరు మిక్సీలో పౌడర్ గా చేసి కలుపుతారు. కానీ ఈ రవ్వలడ్డులో పంచదార పలుకులు పంటి కింద పడితేనే చాలా రుచిగా ఉంటుంది.

ఇంట్లో ఉండే సరుకులతో క్షణాలలో తయారయ్యే ఈ లడ్డు 5,6 రోజులపాటు నిల్వ ఉంటాయి. చాలా రుచిగా ఉంటాయి. తాజాగా చేసుకుని తిందాం రండి మరి.

భారతీ లక్ష్మి (సైనిక్ పురి)

# అసలు సిసలు కవిత్వానికి ఆనవాలు
# పెన్నా పెన్నుజాలు

తుమ్మూరి రాం మోహనరావు



తెలుగులో గజల్ను అవగాహన చేసుకోవడానికి వీరు గజల్ సౌందర్య దర్శనం అనేపుస్తకాన్ని వెలువరించారు. గజల్ కు సంబంధించిన అనేక వివరాలతో కూడిన పుస్తకంఇది.

.తెలుగులో గజల్ కు దాశరథి ఆద్యుడు కావచ్చు. సినారె గజల్ల తో తెలుగు గజల్ కుప్రాభవం కలిగి ఉండవచ్చు. కాని గజల్ మీద సాధికారత కలిగి ఉన్న కవి పెన్నా అనటంలోసందేహం లేదు.వీరు సల్లాపం మరియు శిశిర వల్లకి అనే గజల్ సంపుటులనువెలువరించారు.


కవిసేన మానిఫెస్టో,ఆధునిక భారతం వంటి రచనలతో సుప్రసిద్ధులైన గుంటూరుశేషేంద్ర శర్మ గారి కవిత్వం మీద పరిశోధన సల్పిన పెన్నా శివరామకృష్ణ గారు హైదరాబాదువిశ్వవిద్యాలయం నుండి 'శేషేంద్ర కవిత్వానుశీల-నం' అనే సిద్ధాంత గ్రంథం సమర్పించి పిహెచ్. డి పట్టా పొంది డాక్టర్ పెన్నా శివరామకృష్ణ అయ్యారు.

వీరు కవిత్వం మరియు విమర్శలో సవ్యసాచి.అనేక అంశాలపై వీరి విమర్శకొనసాగింది.

శివారెడ్డి కవిత్వం -పరిణామ వికాసాలు,ఎరుక (సాహిత్య వ్యాసాలు),సినారె విశ్వంభరలోఅర్థయు-క్తి,ఆవిష్కరణ (సాహిత్య వ్యాసాలు),తెలుగు గజల్లు రుబాయీలు,గోరటి వెంకన్నకవితా పరామర్శ,వచన-కవిత-అలంకారికత


ఎన్.గోపి కవితాతత్త్వ వివేచన వంటి పుస్తకాలు సాహి-త్యప్రియులకు కరదీపికలవంటివి.

ఇవి కాకుండా 'రోజురోజుకో చరిత్ర',



'జాతీయ అంతర్జాతీయ దినోత్సవా-లు',నిరాశావాది నిఘంటువు',' ప్రేమ మరికొన్నిసంగతులు','ముద్దుల ముచ్చట్లు','తారీఖుల్లో తెలంగాణ' వంటి వైవిధ్యం కలిగిన పుస్తకాలు వీరి పెన్ను విరచించింది.

అంతే గాక వీరి సహ సంపాదకత్వ నిర్వహణలో ప్రేమ-101కవితలు,క-విత్వదశాబ్ది,తెలంగాణ సంస్కృతి-కళలు,శివారెడ్డి కవిత్వం-విమర్శ-లు,ఆమె ఎవరైతే మాత్రం,ఎన్.గోపి భావచిత్రదీపాలు,శివారెడ్డి పీఠికలు-,దశాబ్దికవిత,పరంపర,నోముల సా-హిత్యముచ్చట్లు వంటి పలు పుస్త-కాలు వివిధ ప్రచురణసంస్థల ద్వారా







వెలువడ్డాయి.ఇది వీరి సాహిత్య ప్రతిభకు గీటు-రాయిగా చెప్పవచ్చు.

'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్నట్లు వీరి ప్రతిభ-కు తగిన గుర్తింపుగా అనేక పురస్కారాలువీరిని వరించాయి.

నూతలపాటి సాహితీ సత్కారం, ఆంధ్ర సారస్వత సమితి (మచిలీ పట్నం) సాహితీ పురస్కారం, తెలుగువిశ్వవిద్యాలయం-పిల్లలమ-ఱ్ఱి వేదవతి జగన్నాథం స్మారక పుర స్కారం,శ్రీమ-తి కొలకలూరిభాగీరథి తెలుగు సాహిత్య విమర్శ పుర స్కారం,వీరి దీపఖడ్గం కవితా సంపుటికిఉ-మ్మడిశెట్టి సాహితీ అవార్డు,సాహితీ గౌతమి (కరీం-నగర్) వారి సి.నా.రె.కవితాపురస్కారం, ద్వానాశాస్త్రి సాహిత్య పురస్కారం, తెలుగు విశ్వ విద్యాలయం సాహితీపురస్కారం (దీపఖడ్గం కవితా సంపుటి-కి),తెలంగాణ సారస్వత పరిషత్ వారి సి.నా.రె. సాహిత్య పురస్కారం వీరిని వరించాయి.

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో తెలుగు ఉపన్యాస కులుగా పనిచేసిఉద్యోగ విరమణ గావించిన పెన్నా శివరామకృష్ణ శర్మ గారు ఫిబ్రవరి 8,1960 న నల్లగొండ-జిల్లా దుగునవల్లి గ్రామంలో అనం-తలక్ష్మి శేషావతారం దంపతులకు-జన్మించారు.సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు నుండి క్రమంగా ఎం.ఏ.,ఎం.ఫిల్, పిహెచ్.డి.పట్టా-లు సంతరించు కున్నారు.

ముగించే ముందు ఒక చిన్నమాట. వీరి పలు ప్రక్రియలలో 'అశ్రువు'అనే పదం పలుచోట్ల కనబడుతుంది. నేనైతే ఆ పదంపెన్నా గారి సాహిత్య సంతకంగా భావిస్తాను. భావతీవ్ర తకు సంకేతంగా రసార్ద్రంగా వాడేఆ పదం పెన్నాగారి కవిత్వపుటా ల్చిప్ప లో పడి ఆణిముత్యంగా మారిన స్వాతిచినుకంటాను.అశ్రుధార అనే శీర్షికతో ఒక పుస్తకమే వెలువరించా రంటే వారికి ఆ పదంమీద ఉన్న మమకారం ఎంతటిదో తెలుస్తుంది.

ఇటీవల ముఖపుస్తకంలో వీరి పెన్నా సరాలు ఎందరో పాఠకులను-అలరిస్తున్నాయి.మచ్చుకి

--కలలలోనే బతుకు స్వేచ్ఛే
ఒకరు ఇచ్చిన బహుమతి!
మనసు కోరిన కలలు కనుటకు
నిదుర ఇవ్వదు అనుమతి!

-ఇలా తాత్త్వికతతో కూడుకొన్న సరాలు వారి కవితా స్వరాలు.

నిరంతర సాహిత్యైకజీవి,కవితా తత్త్వ పిపాసి ఎందరికో మార్గదర్శి తెలుగు భాషకుతెలంగాణ గడ్డకు దొరికిన ఒక ఆణిముత్యం పెన్నా. పెన్నా గారి పెన్ను పెన్నానదిలాజా-లువారి నిరంతర కవితాద్రుమాలు పెంచుతూ, సాహితీ సుమాలు పం-చుతూఉండాలని అభిలషిస్తున్నాను

******



# క్షణ భంగురము



పోడూరి శ్రీనివాసరావు

జీవితమంటే క్షణ భంగురమనీ...
జీవితమంటే బుద్బుద ప్రాయమనీ...
తెలిసి కూడా ఎందుకంత మమకారం?
మనమేమీ చిరంజీవులం కాదని తెలియదా!

ప్రాణాల మీది తీపి చావనంటోందా?
అనుభవించిన కష్టనష్టాలు చాలవా?
ఇంకా ఏవేవో సుఖసౌఖ్యాలు కావాలా?
ఇంకా బతకాలని ఎందుకంత తాపత్రయం?

నీవా సిద్ధాంతాన్ని నమ్మినా నమ్మకపోయినా...
సృష్టికర్తకు తెలుసుగా జీవితం క్షణభంగురమనీ...
అందుకే తన ధర్మం తను నిర్వర్తిస్తున్నాడు
నిముషానికో నాలుగు ప్రాణాలు తీసేస్తూ...

నీకంటే... ఆలోచన...
ఆ ప్రాణాలెలా పోతున్నాయా! అని
కరోనా అవ్వచ్చు... హార్ట్ ఎట్టాక్ అవచ్చు..
ఆకలి దప్పులవ్వచ్చు... కుటుంబ సమస్యలవ్వచ్చు...

ప్రేమ వైఫల్యం అవ్వచ్చు... సంసారంలో కలతలవ్వచ్చు...
నిరుద్యోగ సమస్యలవ్వచ్చు... మరేదైనా కారణమవ్వ-
చ్చు...

ఆ జగన్నాటక సూత్రధారికి అవేమీ అక్కరలే-
దు...
భూమిభారం తగ్గించడానికి... సమతుల్యం
చేయడానికి...

ఆయన నమ్ముకున్న సిద్ధాంతం ఒక్కటే!
పెరుగుతున్న జనాభాను అరికట్టడం అంతే!
తుఫానవ్వచ్చు... కరువు కాటకాలవ్వచ్చు...
హత్యలవ్వచ్చు... ఆత్మహత్యలవ్వచ్చు...

ప్రమాదాలవ్వచ్చు... విపరీతపరిణామాల-
వ్వచ్చు...
అకాల మరణాలవ్వచ్చు... కారణాలేమైనా
కావచ్చు...
ఆయన సిద్ధాంతం ప్రకారం జీవితమంటే క్షణ-
భంగురమే!
అందుకే నిముషానికి నాలుగు ప్రాణాలు హరి-
స్తుంటాడు...

క్రితం జన్మ పాపపుణ్యాల ప్రకారం
మళ్ళా జన్మ ఎత్తడం - జన్మ రాహిత్యం
అంతా క్షణకాలంలో జరిగే
ఆ భగవంతుని లీలావినోదాలేగా!

# మతి



చాగంటి శరత్ బాబు

"అబ్బో - నువ్వొక్కడివీ మంచోడివి. మేమంతా చెడిపోయాం"

"అది కాదురా. పరీక్షలు దగ్గర పడుతున్నాయి. పైగా సిలబస్ చాలా ఉంది"

"మాకు లేదా - నీ ఒక్కడికే ఉందా. ఒక్క గంట అలా తిరిగొస్తే కొంపలు మునిగిపోతాయా?"

"గంట అంటాం. మొత్తానికి ఈ పూటంతా...."

"ఒరేయ్ - అందరం కల్సి వెళ్తున్నాం. సరదాగా కలవరా అంటే పాత తెలుగు సినిమా హీరోలా మాట్లాడకు, పద."

బయలుదేరక తప్పలేదు. రాత్రి తిరిగి వచ్చాక చదవటానికి మూడ్ రాలేదు. సరే. రేపు ఉదయం లేస్తూనే.... అనుకుంటూ టీవీ దగ్గరకు చేరాడు

"ఒరేయ్. వీడు మామూలువాడు కాదు. పరిపూర్ణ ఆరోగ్యవంతుడు-

"అందరూ ఒక్కసారిగా పగలబడి నవ్వేరు.

'ఒక్కటంటే ఒక్క మంచి అలవాటు లేదు" మరీ ఒక్కసారి నవ్వులు చెలరేగాయి.

"వాడి జీవితంలో సిగరెట్ వాసన ఎరగడు. ఒక్క పెగ్గు వేసుకోవడం అటుంచి దగ్గర్నుంచి కూడా చూడలేదు. ఇక..."

"ఒరేయ్, ఒరేయ్. కాస్త ఆపరా"

"ఎంతమాట? మేమంతా పరమ దుర్మార్గులం. దురలవాట్లతో పూర్తిగా చెడిపోయినవాళ్ళం."

"అలా అని నేనన్నానా? అవన్నీ నాకు పడవు"

"మాకు మాత్రం పడతాయా? నలుగురితో కంపెనీ కోసం సరదాగా..."

"సిగరెట్లు, మందూ లేకపోతే సరదా ఉండదా?"

"ఎందుకుండదూ? ఇవి ఉంటే సరదా రెట్టింపవుతుంది"

"అదంతా ఉత్తి భ్రమరా"

"అవును బాబూ. మాకు అన్నీ భ్రమలు. నీవైతే...."





"చంపుకు తినకండిరా"

"రోజూ నిన్ను ఎవడూ అడగడోయ్. ఇవేళ అందరికీ కుదిరింది. సరదాగా ఎంజాయ్ చేద్దాం అని పిలిచాం. దానికి నువ్వు ఇలా ఓవర్ ఏక్షన్ చెయ్యటం మాత్రం బాగా లేదు-"

"మూడ్ పాడైపోయిందిరా"

"ఇలా అప్ సెట్ చేస్తావనుకోలేదు. అయినా నీ సంగతి తెలిసీ నిన్ను అడగటం మాదే తప్పు"

"క్షమించరా. ఇంకెప్పుడూ నిన్ను అడగం".

అందరూ తలో మాటా నిష్టూరంగా అనడం మొదలైంది.

"వాడిని అడగద్దురా. ఎలాగూ ఒప్పుకోడు. మూడ్ చెడగొడ్తాడని అంటూనే ఉన్నాను. మీరు వినలేదు.""పోన్లేరా. మన స్నేహం, మన కంపెనీ వాడికంత భారంగా ఉంటే ఏంచేస్తాం. సారీరా - నిన్ను రమ్మనటం తప్పైపోయింది."

"ఛ ఛ - ఏంట్రా ఇది? ఇంత ఫీలైపోవాలా? చిన్న విషయం...."

"నీకు మేం చిన్న విషయం. మాకు నువ్వు చాలా ముఖ్యం. లేకపోతే ఇంతసేపు..."

"సరేరా - కానివ్వండి. మీకోసం ఇవేళ ...", మొత్తానికి లొంగిపోయేడు. ఒక్కసారే కదా అనుకున్నాడు కానీ.... తెలిసిన కథే. చాలా చోట్ల జరిగేదే కదా?

*స్వామి హనుమ మైనాకుడుని దాటి ముందుకు సాగుతున్నారు. హఠాత్తుగా మరో ఆటంకం. సురస... 'బ్రహ్మ నిన్ను నాకు ఆహారంగా పంపించాడు. నా నోట్లో ప్రవేశించు...' అంటూ. బ్రహ్మదేవుడు పంపించాడంది. అంటే ఆమె తన శత్రువు కాదు. మీద పడి తినటానికీ రావటం లేదు. అంటే ఇది తనని పరీక్షించటం కోసం జరుగుతోందన్న ఆలోచన బుద్ధిశాలి అయినా స్వామికి స్ఫురించటం సహజమే కదా!ఇప్పుడు సురసతో చేయాల్సింది యుద్ధం కాదు. ఇక్కడ యుద్ధం చేస్తూ కాలయాపన చేయటం పొరబాటే అవుతుంది. అందుకే స్వామి తన శరీరాన్ని చిన్నదిగా చేసి వేగంగా ఆమె నోట్లో ప్రవేశించి బయటకొచ్చేశారు.

"అమ్మా... నువ్వు చెప్పినట్లే నీ నోట్లో ప్రవేశించేశాను. ఇప్పుడు నన్ను వదిలివెయ్యటం ధర్మం" అన్నారు. సురస, దేవతలు సంతోషించారు. ఎక్కడ తగ్గాలో కూడా స్వామికి తెలుసు. అంతే!

**మిత్రులు బలవంతం చేసినప్పుడు వాదనలు, చర్చలు అనవసరం. అక్కడ యుక్తితో తప్పించుకోవాలి. అలాంటపుడు ఒక అబద్ధం ఆడినా తప్పు లేదు. ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవటమే!

# ఫ్రెంచ్ ఓపెన్ నుంచి వైదొలగిన నవోమి ఒసాకా





RNI No. TELTEL/2011/39497 JUNE 2021 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st June Date of Posting: 8th June



# హనుమజ్జయంతి శుభాకాంక్షలు

Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.